మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


# ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులదే

◆ పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
◆ స్థానిక అధికారులపై మంత్రి ఆగ్రహం



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

**ఆత్మకూర్ అక్టోబర్ 15, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయాల్సి న బాధ్యత స్థానిక అధికారుల దేనని మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు వాకిడి శ్రీహరి అన్నారు. బుధవారం రోజు మున్సిపల్ కేంద్ర మైన ఆత్మకూరు పట్టణంలోని మార్కెట్ యార్డ్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు సంబంధించి అధికారులతో మంత్రి వాకిటి శ్రీహరి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ మొత్తం నియోజకవర్గానికి ఇప్పటికే 3500 ఇంటి నిర్మాణాలు పూర్తి చేసేందుకు పనులు కొనసాగుతున్నాయని తక్షణమే రెండో విడతగా మరో మూడు వేల ఐదు వందల ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లుగా ఆయన తెలిపారు.గ్రామాలలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు నత్తనడకన సాగు తున్న విషయాన్ని గుర్తించి స్థానిక తహసిల్దార్ మరియు ఎంపీడీవో తదితరులు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి నిర్మాణాలలో కొనసాగుతున్న జాప్యం నివారించేందుకు లబ్ధిదారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు కొనసాగించాలని ఆయన ఆదేశించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ఇసుక కొరత ఏర్పడిన నేపథ్యంలో ఇంటి నిర్మాణాలు ఆలస్యం అవుతున్నాయని తాసిల్దార్ చాంద్ పాషా మంత్రి దృష్టికి తేవడంతో అక్కడినుండే రాష్ట్ర మంత్రి వాకిడి శ్రీహరి వనపర్తి జిల్లా కలెక్టరుకు ఫోన్లో ఆదేశాలు జారీ చేస్తూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు సంబంధించి ప్రతి లబ్ధిదారుడికి 8 ట్రాక్టర్ల ఉచిత తీసుకొని 100 చేసేందుకు స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. ఉమ్మడి ఆత్మకూరు మండలంలో 500 పేజీలకు ఇంటి నిర్మాణాలు కొనసాగుతున్నాయని మరో 15 రోజుల్లోగా ఇంటినిర్మానాలు పూర్తి చేసేందుకు స్థానిక అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని ఆయన ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ విషయంలో రాష్ట్రంలోనే మక్తల్ నియోజకవర్గం నుండి 363 కోట్ల రూపాయల రుణమాఫీ పూర్తి చేసి రాష్ట్రంలోని ఎనిమిదవ స్థానంలో నిలిచిన విషయాన్ని అధికారులు గుర్తించి ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పూర్తి చేయడంలో కూడా అదే విధంగా రాష్ట్రస్థాయిలో పోటీపడేందుకు నిరంతరం కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ యార్డ్ చైర్మన్ రహమతుల్లా అధ్యక్షత వహించగా రాష్ట్ర కల్లుగీత పారిశ్రామిక విభాగం చైర్మన్ నాగరాజుగౌడ్ తాసిల్దార్ చాంద్ పాషా ఎంపీడీవో శ్రీపాదూ ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ మక్తల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు తులసిరాజు యాదవ్ ఆత్మకూరు పట్టణ కాంగ్రెస్ నాయకులు నల్లగొండ శ్రీనివాసులు, దామోదర్, నాగేష్, గడ్డమీది అశోక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అయ్యో ఖాన్, అమరచింత మండల పార్టీ నాయకులు మహేందర్రెడ్డి తదితరులతో పాటుగా స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**స్థానిక అధికారులపై మంత్రి ఆగ్రహం...** రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు సంబంధించి సమీక్ష నిర్వహించేందుకు ఆత్మకూరు మార్కెట్ యార్డ్ కార్యాలయానికి చేరుకున్న అరగంట వరకు అధికారులు రాకపోవడంతో మంత్రి అసహనం వ్యక్తం చేశారు రాష్ట్ర మంత్రి పాల్గొంటున్న సమావేశానికి సైతం స్థానిక అధికారులు సమయపాలన పాటించకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు భవిష్యత్తులో ఇలా జరగకుండా వ్యవహరించాలని సూచించారు.

# చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



ఒలంపిక్ జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే



మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, అక్టోబరు 15 ప్రభాతవార్త :** విద్యార్థులు తమ చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలోఅండర్ 14, అండర్ 17 బాల, బాలికలకు నిర్వహించే ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్ అథ్లెటిక్స్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులచే గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఒలంపిక్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 15 మండలాల నుంచి క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలవాలని, ఆటల్లో గెలుపు ఓటములు సహజమని ఓటమి చెందిన విద్యార్థులు మరోసారి ప్రయత్నం చేసి విజయం సాధించేందుకు పట్టుదలతో ముందుకెళ్లాలని ఎమ్మెల్యే విద్యార్థులకు సూచించారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఇదే గ్రౌండ్లో తన ఆటపాటలు ఆడారని అలాంటి ఈ క్రీడా ప్రాంగణాన్ని నేడు ఎంతో అత్యాధునిక క్రీడా ప్రాంగణంగా తీర్చిదిద్దేందుకు తాను 50 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశారని తెలిపారు. ఇదే ఆవరణలో 15 కోట్ల రూపాయలతో జిమ్,స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసినట్టు ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్లచందర్, విద్యాశాఖ అధికారులు ఆయా మండలాల క్రీడా ఉపాధ్యాయులు, విద్యార్థులు వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు నివాళులు అర్పించిన ఎమ్మెల్యే :** బుధవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లో ఏరోస్పేస్ ఇంజనీర్‌గా పనిచేసిన ఆయన భారతదేశపు మిస్సైల్ మ్యాన్ గా పేరుగాంచారని గుర్తు చేశారు. 1998లో భారతదేశ పోఖ్రాన్॥ అణు పరీక్షలలో సాంకేతికత పరంగా కీలక పాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు. 2015 జూలై 27న, షిల్లాంగ్ లోనీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఎంఎం)లో ఉపన్యసిస్తున్న సమయంలో కలాం గుండెపోటుతో మృతి చెందినట్లు ఆయన గుర్తుకు చేసుకున్నారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీర్ల చందర్

-మిగతా4లో..

# ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా కొనసాగేలా విస్తృత ఏర్పాట్లు

◆ గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రులు. పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

**గద్వాల టౌన్ అక్టోబర్ 15, ప్రభాతవార్త:** ఖరీఫ్ లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తెలిపారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన అన్ని చర్యలు చేపట్టామన్నారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు బుధవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ధాన్యం సేకరణ ప్రక్రియపై సమీక్ష జరిపారు.ఈ సందర్భంగా ధాన్యం సేకరణ కోసం జిల్లాలో చేపట్టిన ఏర్పాట్ల గురించి కలెక్టర్ బి.యం.సంతోష్ మాట్లాడు తూ, జిల్లాలో ఈసారి ఖరీఫ్ లో 38,748 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటసాగు చేయడం జరిగిందని, 2.76 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. ఇందుకు గాను జిల్లాలో అవసరం మేరకు ఐకెపి 66, పిఏసిఎస్ 13,మెప్మా 05 మొత్తం 84 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నవంబర్1వ తేదీన ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాలలో ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా అన్నిచర్యలు తీసుకున్నామన్నారు. సేకరించిన ధాన్యాన్ని రవాణా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు.కొనుగోలు కేంద్రాలలో అవసరమైన గన్ని బ్యాగులు, టార్పాలిన్లు, ప్యాడి క్లీనర్లు, తూకం యంత్రాలను అందుబాటులో ఉంచనున్నట్లు తెలియజేశారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణ సజావుగా జరగాలని మంత్రులు ఉత్తమ్ కుమార్, తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ. 2389, సాధారణరకానికి రూ. 2369 చొప్పున కనీస మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని తెలియజేశారు. ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం ఇక్కడికి తరలించి విక్రయించేందుకు పలువురు ప్రయత్నించే అవకాశాలు ఉన్నందున, పొరుగు ధాన్యం రాకుండా సరిహద్దు ప్రాంతాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ విషయంలో పోలీసు శాఖ జిల్లా యంత్రాంగంతో సమన్వయము ఏర్పర్చుకుని సమర్ధవంతంగా పని చేయాలని సూచించారు. రైతులు ధాన్యం విక్రయించిన 48 గంటల వ్యవధిలో వారి ఖాతాలలో బిల్లులకు సంబంధించిన డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని సదుపాయాలూ అందుబాటులో ఉండేలా చూడాలని,ముఖ్యంగా గన్నీ బ్యాగులు,తూకం యంత్రాలు, టార్పాలిన్లు, తేమ కొలిచేయంత్రాలు, గ్రెయిన్ క్యాలిపర్స్ సరిపడా సంఖ్యలో సిద్ధంగా ఉంచాలని, తాగునీరు, నీడ వంటి వసతులు కల్పించాలని సూచించారు.సంబంధిత శాఖల అధికారులందరూ సమిష్టిగా, సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం సేకరణ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు.ఈ వీసీలో అదనపుకలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, డీఎస్ఓ స్వామి కుమార్, సివిల్ సప్లైస్ డీఎం విమల, జిల్లా వ్యవసాయ అధికారి జగ్గునాయక్, డీసీఓ శ్రీనివాస్, డిఎంఓ పుష్పమ్మ, జిల్లా రవాణా అధికారి వెంకటేశ్వర్ రావు, ఏపీడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కొత్తకోట ఎంఈఓ సస్పెండ్

● ఎంఈఓతో పాటు హెచ్‌ఎం ఇద్దరు ఉపాధ్యాయులపై వేటు..
● విధులపై నిరక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని

**వనపర్తి, అక్టోబరు15 ప్రభాతవార్త:** కొత్తకోట ఎంఈఓ తో పాటు కాంప్లెక్స్ హెచ్‌ఎం ఇద్దరు ఉపాధ్యాయులపై వనపర్తి జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని కొరడా ఝుళిపించారు. ఒకేసారి వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 6న కొత్తకోట పరిధి ఆర్జెడి నాటవెల్లి యుపిఎస్ పాఠశాలను డివో సందర్శించారు. ఆ సమయంలో విధులపై నిరక్ష్యంగాఉన్న ఇద్దరు ఉపాధ్యాయులతో పాటు కాంప్లెక్స్ హెచ్‌ఎం మండలవిద్యాధికారిని బుధవారంసస్పెండ్ చేశామనిడీఈవో వెల్లడించారు.

# మధ్యాహ్న భోజనంలో పురుగులు

● మక్తల్ ప్రభుత్వ పాఠశాలలో ఘటన



విద్యార్థులకు నాణ్యత లేని ఆహారం వడ్డించిన దృశ్యం

**మక్తల్ టౌన్, అక్టోబరు 15 ప్రభాతవార్త:** మక్తల్ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పురుగులు రావడం సర్వసాధారణం అయిపోయింది. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు భోజనం చేస్తున్నప్పుడు పురుగులు వస్తున్నాయని మధ్యాహ్న భోజనం మెనూ సరిగ్గా పాటించడం లేదని,నాణ్యత లేని భోజనం, విద్యార్థుల భోజనం పట్ల నిర్లక్ష్యం వహించడం సర్వసాధారణం అయిపోయిందని విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మక్తల్ నియోజకవర్గ నడిబొడ్డునే ఇలాంటి సంఘటన జరగడం శోచనీయం. మధ్యాహ్న భోజనాన్ని ఉపాధ్యాయులు తిన్న తర్వాతనే విద్యార్థులు తినాలనే నిబంధన ఉంది. కానీ అవి ఏవి పట్టనట్టుగా అధికారుల నిర్లక్ష్యం ఉందని స్పష్టమవుతుంది. అన్నంలో పురుగులు వచ్చిన సంఘటనని మండల విద్యాధికారి అనిల్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా వంట ఏజెన్సీ వారిని వెంటనే తొలగిస్తానని హామీ ఇచ్చారు. ఇకనుండి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



# మన పీయూ విశ్వవ్యాప్తం

◆ ఒక్క భవనంతో మొదలై..పదుల సంఖ్యలో నిర్మాణమై..
◆ వేల మంది పట్టభద్రులు..
◆ ఎన్నో ప్రత్యేకతలు..మరెన్నో విజయాలు..
◆ పాలమూరు విశ్వవిద్యాలయం నాలుగో స్నాతకోత్సవం నేడు
◆ ముఖ్య అతిథిగా హాజరుకానున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

4

# వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలి

● విద్యార్థులు గణితంపై శ్రద్ధ వహించి మంచి మార్కులు సాధించాలి : వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి
● డిఎస్పీ ఉద్యోగం సాధించిన గొర్ల సుమశ్రీని అభినందించిన కలెక్టర్



ఉద్యోగాలు సాధించిన వారిని అభినందిస్తున్న కలెక్టర్

**వనపర్తి, అక్టోబరు15 ప్రభాతవార్త:** రాబోయే పదో తరగతి బోర్డు పరీక్షల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు వంద శాతం పాస్ అయ్యే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.బుధవారం జిల్లా కేంద్రంలోని హరిజన వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మి కంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశమై పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులను, అటెండెన్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు మంచి మార్కులు సాధించడం కోసం ప్రత్యేకంగా తయారు చేయించిన గణిత పాఠ్యంశాల పుస్తకాన్ని ఆవిష్క రణ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే పదో తరగతి బోర్డు పరీక్షల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు వంద శాతం పాసయ్యే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. గణితంలో వెనకబడిన విద్యార్థులు మేరుగయ్యే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహిం చడంతో పాటుగా ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. వారం వారం నిర్వహించే పరీక్షల్లో విద్యార్థుల మెరుగుదల కనిపించాలని, బోధన ఇంకా మెరుగ్గా చేయాలని ఆదేశించారు. పదో తరగతి పూర్తయిన తర్వాత విద్యార్థులు డ్రాపవుట్స్ లేకుండా చూడాలని ఆదేశించారు. ఉన్నత స్థాయికి ఎదిగిన విద్యార్థులకు అభినందజిల్లా కేంద్రంలోని హరిజన వాడకు చెందిన పలువురుఉన్నత స్థాయికి చేరిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. గ్రూప్ 1 పరీక్షలో డిఎస్పీగా ఎంపికైన గొర్ల సుమశ్రీ, ఎంబీబీఎస్‌లో సీట్ సాధించిన ఎం. దివ్య, నీట్ లో ఉత్తమ ర్యాంక్ సాధించిన జీ ఉదీప్‌లను కలెక్టర్ శాలువాతో సన్మానించారు. ఉన్నంతంగా ఎదిగిన వారిని స్పూర్తి గా తీసుకుని విద్యార్థులు బాగా చదివి ఉన్నత శికరాలను అధిరోహించాలని సూచించారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని విద్యార్థులు బాగా చదవాలని సూచించారు. గతేడాది ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు వంద శాతం పాస్ అయ్యారని అదేవిధంగా ఈ సారి కూడా ఫలితాలు ఉండాలని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను పాఠశాల తరపున శాలువా తో సన్మానించారు. కార్యక్రమం లో డిఈఓ అబ్దుల్ ఘని, గంధం నాగరాజు, ప్రధానోపాధ్యాయులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ సందర్శనకు విస్తృత భద్రతా చర్యలు

మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ జానకి ధరావత్ బందోబస్తు పై సూచనలు, సలహాలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 15 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మహబూబ్‌నగర్ జిల్లాకు అధికారిక పర్యటనలో భాగంగా పాలమూరు యూనివర్సిటీలో జరగనున్న నాలుగో స్నాతకోత్సవ కార్యక్రమం కలెక్టర్ కార్యాలయంలో జరుగనున్న అధికారిక కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ పర్యటనకు సంబంధించి భద్రతా ఏర్పాట్లు సమీక్షించేందుకు జిల్లా ఎస్పీ డి.జానకి పాలమూరు యూనివర్సిటీలో పర్యటన ప్రదేశాన్ని సందర్శించి అంతరం హైటెక్ ఫంక్షన్ హాల్‌లో బందోబస్తులో పాల్గొనే పోలీసు అధికారులకు, సిబ్బందికి బ్రీఫింగ్ ఇచ్చారు.ఎస్పీ మాట్లాడుతూ గవర్నర్ పర్యటన ఎంతో ప్రతిష్ఠాత్మకం అందువల్ల ప్రతి అధికారికి అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలి. ట్రాఫిక్ నియంత్రణ, ప్రజా రాకపోకలు, వాహనాల పార్కింగ్, భద్రతా కట్టుదిట్టతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఏవైనా అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలి" అని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణా రెడ్డి, డిటిసి డిఎస్‌పి గిరిబాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, మహబూబ్‌నగర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గాంధీ నాయక్, వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, టూటౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్‌ఉద్దీన్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ భగవంత్ రెడ్డి, వుమెన్ పిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, డిసిఆర్‌బి ఇన్స్పెక్టర్ మగ్దూమ్ అలీ, సిసిఎస్ ఇన్స్పెక్టర్లు రత్నం, పరమేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.




భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ జానకి

# చట్టసభల్లో బీసీలకు మొండి చేయి

● ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారు..
● ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మల్లన్న

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 15,ప్రభాతవార్త:** బీసీలను ఓటు బ్యాంకుగానే వాడుకునేందుకు చూస్తున్నారు తప్ప చట్టసభల్లో బీసీలకు ప్రాతినిధ్యంలో మొండి చేయి చూపిస్తున్నాన్నారని ఎమ్మెల్సీ,తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న అన్నారు. మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని ఒంకన్వెన్షన్ హాల్లో బీసీ జేఏసీ సామాజిక తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో బీసీ కార్యకర్తల ముఖాముఖి సమావేశం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్సీ,తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న హాజరై మాట్లాడుతూ బీసీలందరూ ఏకమై రాజ్యాధికారం కోసం కృషిచేయాలన్నారు. 42 శాతం రిజర్వేషన్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసి బీసీల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. ఇంటలెక్చువల్ ఫోరంలో వక్తల ప్రశ్నలకు తీన్మార్ మల్లన్న సమాధానాలు ఇచ్చారు.విద్యా, వైద్యం, వలసలు,ఉపాధి,జనాభాదామాషాప్రకారం రిజర్వేషన్లకు, కార్పొరేటేడ్ విద్య, వైద్యం, కల్తీ ఆహారం, మహిళా సంరక్షణ, నిరుద్యోగ యువత,బీసీ వాదం,సామాజిక న్యాయం,స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు,రిజర్వేషన్లు,బీసీల అస్తిత్వం,కుల గణన, పరిపాలన,సంచార జాతులు, ఆటో డ్రైవర్ల సమస్యలు, వివక్ష ,ఉద్యోగ,సామాజిక,ఆర్థిక,కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు,మేలుకొని కులగణ చేయాలన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధికారంలోకి వస్తే ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్పి వర్కింగ్ ప్రెసిడెంట్

-మిగతా4లో..

# మధ్యాహ్న భోజనమెలా ఉంది?

▸▸ విద్యార్థులను అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి
▸▸ భూత్పూర్ జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించిన కలెక్టర్
▸▸ విద్యార్థులతో కలిసి భోజనం చేయడంలేదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలేదని ఉపాధ్యాయులపై కలెక్టర్ ఆగ్రహం



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్రబోయి

**భూత్పూర్,అక్టోబర్ 15,ప్రభాతవార్త:** మధ్యాహ్న భోజనమెలా ఉంది?ఉపాధ్యాయులు మీతో కలిసి భోంచేస్తున్నారా?? ఇవి జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి మధ్యాహ్న భోజనం చేస్తున్న భూత్పూర్ జెడ్పీ హెచ్‌ఎస్ విద్యార్థులతో మాట్లాడిన ముచ్చట్లివి.జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి బుధవారం మధ్యాహ్న భోజన సమయంలో భూత్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి,మధ్యాహ్న భోజనం నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు.భోజనం చేస్తున్న పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.భోజనం ఎలా ఉందని విద్యార్థుల్ని కలెక్టర్ అడిగి తెల్సుకున్నారు.పాఠశాలలో ఎంత మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని హెచ్‌ఎంను అడుగగా, 24మంది పనిచేస్తున్నారని సమాధానమిచ్చారు.పాఠశాలలో ఉండే ఉపాధ్యాయులు,ప్రధానోపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ఫుడ్ కమిటీ భోజనం చేయాలని,దీన్ని ఎందుకు పాటించడంలేదని కలెక్టర్ విజయేంద్రబోయి ఆగ్రహం వ్యక్తం చేశారు.స్కూల్లో ఉన్న అందరూ

-మిగతా4లో..

# పశువులకు సకాలంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

● నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట టౌన్, అక్టోబరు15 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలోని అన్ని గ్రామాలలో నిర్ణీత షెడ్యూలు ప్రకారం పశువులకు సకాలంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. జిల్లా కేంద్రంలోని బాహర్ పేటలో బుధవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. పశువులకు వేసే టీకాల కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం ఇటీవలే ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని ప్రారంభించిందని, ఆ పథకం కిందరాష్ట్రంలోనీ నాలుగు జిల్లాలు జనగామా,నాగర్‌కర్నూల్, గద్వాలతో పాటు నారాయణపేట జిల్లాను కూడా ఎంపిక చేసిందని గుర్తు చేశారు. అయితే ఆ పథకంలో వ్యవసాయ అనుబంధ శాఖలతో పాటు పశుసంవర్ధక, డైరీ, ఫిషరీస్, 11 అనుబంధ శాఖలలోని పారా మీటర్స్‌ల అభివృద్ధి చేయడం జరుగుతుందని, అందులో భాగంగానే పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. దాదాపు లక్ష టీకాల డోసులు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలోని అన్ని గ్రామాల్లో పశువులకు టీకాలు వేయించాలని కలెక్టర్ పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, పశువైద్యాధికారి, అనిరుద్ చారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



## నిరుపయోగంగా అంగన్‌వాడీ భవనం

### ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులు

**శ్రీరంగాపూర్, అక్టోబరు 15 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని కంభాలాపురం గ్రామంలో రెండు అంగన్‌వాడి సెంటర్లు ఉన్నాయి. అంగన్‌వాడి మొదటి సెంటర్ నందు టీచరు, ఆయా లేకపోవడంతో అంగన్‌వాడి భవనం గత మూడు సంవత్సరాల నుంచి నిరుపయోగంగా ఉంది. రెండో సెంటర్ నందు అంగన్‌వాడి టీచర్ మాత్రమే ఉన్నారు అక్కడ కూడా పనిచేస్తున్న ఆయా రిటైర్మెంట్ కావడంతో అక్కడ ఆయ లేకుండా టీచర్ మాత్రమే చూసుకోవడం జరుగుతుంది. అంగనవాడి టీచర్ వ్యక్తిగత సెలవు తీసుకున్నప్పుడు, మీటింగ్‌లకు వెళ్లినప్పుడు ఆ రెండో సెంటర్ కూడా బంద్ కావడం జరుగుతుంది. దీనివల్ల పిల్లలకు గర్భిణీ స్త్రీలకు బాలింతలకు చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. అంగన్‌వాడి కేంద్రాలు ప్రధానంగా శిశు సంరక్షణ, ప్రీస్కూల్ విద్య, పోషకాహారలోపం ఉన్న పిల్లలకు అనుబంధ పోషకాహారం అందించడం జరుగుతుంది. అదేవిధంగా గర్భిణీ స్త్రీలకు బాలింతలకు అవసరమైన పోషక ఆహారం అందిస్తారు. కానీ అంగన్‌వాడి సెంటర్ల నందు ఖాళీలను భర్తీ చేయకపోవడం వల్ల చిన్నారులు బాలింతలు గర్భిణీ స్త్రీలు అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. అందువల్ల అంగన్వాడి సెంటర్ల నందు ఖాళీగా ఉన్న టీచరు ఆయా పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై సిడిపిఓ ను వివరణ కోరగా ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వానికి పంపడం జరిగిందని, ప్రభుత్వం ఖాళీ పోస్టులను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది.

## సిపిఆర్ గురించి అవగాహన కల్పించిన వైద్యాధికారి

**పెబ్బేరు, అక్టోబరు15 ప్రభాతవార్త:** పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి డా. ప్రవళిక ఆధ్వర్యంలో పెబ్బేరు పట్టణ ప్రజలకు, వైద్య సిబ్బందికి సీపీఆర్ అవగాహన కార్య క్రమం నిర్వహించారు. హృదయ ఆపద సమయంలో తీసుకోవలసిన అత్యవసర చర్యలపై వివరం గా అవగాహన కల్పించారు. సిపిఆర్ పద్ధతి గురించి ప్రాక్టికల్, టీవీ ద్వారా ప్రజలకు శిక్షణ అందిం చారు. అలాగే ప్రతిజ్ఞ కూడా చేయించడం జరిగింది. కార్యక్రమంలో హోమియో ఆసుపత్రి డా. వసుంధర దేవి, హెల్త్ సూపర్‌వైజర్ పార్వతి, స్వరూపరాణి, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, రాజేష్ గౌడ్,కృష్ణ, ఊర్మిళ, కుమారి, గోపాల్ గౌడ్, శారద, ఆశ కార్యకర్తలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి ప్రవళిక

## బహిరంగ ప్రదేశాల్లో, రోడ్డుకి ఇరువైపుల చెత్త వేస్తే రూ. 5వేలు జరిమానా

### మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య





చెత్తను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

**నారాయణపేట టౌన్, అక్టోబరు15 ప్రభాతవార్త:** నారాయణ పేట పట్టణ పరిధిలో దామరగిద్ద రోడ్డు రహదారికి ఇరువైపుల వున్న బహిరంగ ప్రదేశంలో చెత్తను వేయడం జరుగుతుంది. ఆ ప్రాంతంలో ఉన్న చెత్తను తడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులచే శుభ్రం చేయించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య మాట్లాడుతూ ప్రజలు అందరూ పట్టణంలోని బహిరంగ ప్రదేశాలలో, రోడ్డుకు ఇరువైపుల చెత్తను వేసినచో లేదా చెత్త వేస్తూ పట్టుబడితే రూ.5వేలు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఇంచార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ తిప్పన్న, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీధర్, పురపాలక పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఉమ్మడి జిల్లా ఆర్టీసీ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల గౌరవ అధ్యక్షులుగా దార భాస్కర్



దార భాస్కర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్ (నవాబుపేట), అక్టోబరు 15 ప్రభాతవార్త :** నియోజకవర్గ టిపిసిసి కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న దార భాస్కర్‌ను బుధవారం టీజీఎస్ ఆర్టీసీ, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా గౌరవ అధ్యక్షులుగా నియమించడం జరిగింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నిక జరిగిన అనంతరం నూతన ఉద్యోగుల సంఘంఅధ్యక్షులు దార భాస్కర్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. సమస్యలను పరిష్కరించుటకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రాజయ్య నాయక్, జిల్లా గౌరవ అధ్యక్షులు జాజిమొగ్గ నర్సింలు, ఉమ్మడి జిల్లా ఆర్టీసీ,ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి గడ్డం శ్రీనివాస్,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యమ్మ,ఉపాధ్యక్షులు వెంకటేష్, చంద్రయ్య, ఆంజనేయులు, మంజుల, జాయింట్ సెక్రటరీలు, అసిస్టెంట్ సెక్రటరీలు, సభ్యులు ఉన్నారు.

## న్యాయం కోసం యువ కాంగ్రెస్ బలమైన స్వరం

**నారాయణ పేట, అక్టోబరు 15 ప్రభాతవార్త:** నారాయణ జిల్లాలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికరెడ్డి యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి, ఇంచార్జి సయ్యద్ ఖాలీద్ అహ్మద్, జిల్లా ఇన్చార్జిలు సంధ్య, కృష్ణ వర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు కేరళలో యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆనంద్, ఆర్ఎస్ఎస్ నాయకుల చేత లైంగిక వేధింపులకు గురై ప్రాణాలు కోల్పోయిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా యువ కాంగ్రెస్ అధ్యక్షులు కోట్ల మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ వారి నిజ స్వరూపం బయటపడింది ఆనంద్‌కి న్యాయం దక్కే వరకు ఆర్ఎస్ఎస్ దుష్ప్రవర్తనను ప్రజల ముందుంచే వరకు యువ కాంగ్రెస్ వెనక్కి తగ్గదు అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ యూసుఫ్ తాజ్ అసెంబ్లీ ప్రెసిడెంట్ హరీశ్వర్ రెడ్డి, దామరగిద్ద మండల ప్రెసిడెంట్ శ్రీనివాస్, రవికుమార్ గౌడ్, జిలాల్పూర్ కార్తీక్ రెడ్డి, మాజీద్ భాయ్, అనిల్, అరుణ్ వెంకటేష్, నరసింహారెడ్డి, శివ గౌడ్, రవికుమార్, కాత్రే పవన్, చందు, తిమ్మప్ప, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఆనంద్‌కు న్యాయం జరగాలని కోరుతున్న కాంగ్రెస్ నాయకులు

## కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పాడి అభివృద్ధి

### అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**ఉప్పునుంతల,అక్టోబరు15 ప్రభాతవార్త:** పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో పాడి అభివృద్ధికి కృషి చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని టిపిసిసి ఉపాధ్యక్షులు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీ కృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో పాడి అభివృద్ధి కోసం పాటు పడింది కాంగ్రెస్ పార్టీనేని, నల్లమల్ల ముద్దుబిడ్డ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాడి రైతుల కోసం ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. ఉప్పునుంతల మండలంలో పశు సంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువులకు, గేదెలకు అందిస్తున్న టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ పిలుపునిచ్చారు. అనంతరం పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీకాలను పశువులకు అందించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ తో పాటు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జ్ఞాన శేఖర్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ గంగాపురం రాజేందర్, మామిళ్ళపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి, ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు,నాయకులు కట్ట అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, ఉప్పరి పల్లి మాజీ సర్పంచ్ అనంత ఇంద్రసేనారెడ్డి, పశు వైద్యాధికారులు పొట్టల వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డా.బిచ్చమ్మ, మహేశ్వరి, మాజీ వైస్ ఎంపీపీ కాలువ గోవర్ధన్ రెడ్డి, దాసర్లపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగుల నరసింహారెడ్డి,మాజీ ఉపసర్పంచ్ మొగులాల్‌గౌడ్, సూరం ప్రశాంత్ రెడ్డి (బిట్టు),తిరుపతయ్యగౌడ్, పశు వైద్య సిబ్బంది శ్రీను, కుమార్, వెంకటయ్య, మిరాజ్, హబీబ్, గోపాల మిత్ర సూపర్ వైజర్ గట్టు మురళీధర్ రెడ్డి, గ్రామాల పాడి రైతులు పాల్గొన్నారు.

## కాలయాపనతో రైతును నట్టేట ముంచుతున్న రాష్ట్ర ప్రభుత్వం

### బిజెపి రాష్ట్ర నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి

**ఆత్మకూర్ అక్టోబర్15, ప్రభాతవార్త:** గత శాసనసభ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తూ రైతులను నట్టేట ముంచుతుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మీకాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. బుధవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తామని చెప్పి ఇప్పటివరకు కనీసం 40 మేరా కూడా రైతులకు రుణమాఫీ చేయలేదని అంతేకాకుండా ప్రతి క్వింటాల్ వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్ చెల్లిస్తామని గత వర్షాకాలానికి సంబంధించిన ధాన్యానికి కూడా బోనస్ రైతులకు చెల్లించకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత సంవత్సరం కురుమూర్తి స్వామి దేవాలయం సన్నిధిలో దేవస్థానానికి ఘాట్రోడ్ నిమిత్తం 113కోట్ల రూపాయలను విడుదల చేస్తున్నట్లుగా ప్రకటించి నేటి వరకు కనీసం పనులు ప్రారంభించకపోవడం కాంగ్రెస్ పార్టీ అసమర్థతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి మక్తల్ నియోజకవర్గంలో ఒక సంవత్సర కాలంలోనే రోడ్లన్నింటిని పూర్తి చేసి రోడ్లకు మహర్దశ తీసుకువస్తానని హామీ ఇచ్చి నేటి వరకు కనీసం నియోజకవర్గంలోనే పేరు పొందిన ప్రదర్శిని జూరాల ప్రాజెక్టు వరకు కూడా రోడ్డునిర్మాణం చేపట్టకపోవడం ఎంతవరకు హామీలు అమలు చేస్తున్నారో రాష్ట్ర మంత్రి మరణం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీలకు 42శాతం రిజర్వేషన్ ప్రకటిస్తున్నట్లుగా కాంగ్రెస్ నాయకులు డ్రామాలు వాడుతున్నారని కోర్టులు మరియు న్యాయస్థానాల పేరు చెప్పి బీసీలను మరోసారి మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ విశ్వ ప్రయత్నాలు చేస్తుందని ఆయన ఆక్షేపించారు. మక్తల్ నియోజకవర్గం లోని అమర్ చింత ఆత్మకూరు మండలాలలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు పూర్తి చేయించడంలో స్థానిక నాయకులతో పాటుగా రాష్ట్ర మంత్రి పూర్తిగా విఫలమయ్యారని ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు కనీసం ఇసుకను కూడా సరఫరా చేయలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర మంత్రి నియోజకవర్గ పై దృష్టి సారించి ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగించేందుకు చర్యలు చేపట్టనున్నట్లుగాఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల బిజెపి అధ్యక్షులు అశోక్ గోపాల్ యాదవ్ మక్తల్ నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ రేచింతల శ్రీనివాస్ ఆత్మకూర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అశ్విని కుమార్ బిజెపి నాయకులు ఎల్లన్న దేవరపల్లి ఆంజనేయులు,తమ్మలివిజయ్,మండల సూరి తదితరులతో పాటుగాపలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మీకాంత్ రెడ్డి

## విద్యార్థుల విజయానికి క్రమశిక్షణ, నిరంతర కృషి కీలకం

### ఉపాధికల్పన అధికారి ప్రియాంక

**గద్వాల టౌన్ అక్టోబర్ 15, ప్రభాతవార్త:** క్రమశిక్షణ , నిరంతర కృషి విద్యార్థుల విజయానికి కీలకమని జిల్లా ఉపాధి కల్పనాధికారి డాక్టర్. ప్రియాంక అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం గట్టు మండలం, ఆలూరు జడ్‌పీహెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రేరణ, కెరీర్ ప్లానింగ్ తరగతులు నిర్వహించబడిన సందర్భంగా ఆమె విద్యార్థులతో ముఖాముఖి మాటాడారు. చదువు, ప్రణాళిక, స్వీయ ప్రేరణ, సరైన కెరీర్ మార్గం, చదివిన విషయాన్ని అర్థం చేసుకోవడం వంటి అంశాలు విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపరిచే ముఖ్యమైన మూలాధారాలు అని ఆమె అన్నారు. ఏదైనా కొత్త విషయం నేర్చుకునేటప్పుడు దాని అర్థం చేసుకొని చదవాలి. ప్రతి 45 నుండి 50 నిమిషాల తర్వాత 5-10 నిమిషాల విరామం తీసుకోవడం ద్వారా ఏకాగ్రత పెరుగుతుంది. సరైన ప్రణాళిక లేకపోతే ఎంత చదివినా ఫలితం ఉండదనీ, అందువల్ల టైమ్‌టేబుల్ రూపొందించి ప్రతిరోజూ దానిని కచ్చితంగా పాటించాలని సూచించారు. అదేవిధంగా కష్టమైన సబ్జెక్టులను విద్యార్థులు ఉత్సాహంగా ఉండే సమయాల్లో చదవాలని, చదివిన విషయాన్ని వారాంతంలో లేదా నెలాఖరులో తప్పనిసరిగా పునఃపరిశీలించుకోవాలని సూచించారు. మంచి నిద్ర, ఆరోగ్యకరమైన ఆహారం, ఆటలు విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని, చురుకుదనాన్ని పెంచుతాయని చెప్పారు. చదువుతో పాటు భవిష్యత్తు గురించి ఆలోచన కూడా అవసరమని, ఏరంగంలో ఆసక్తి ఉందోఆ రంగంలోనే నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. పుస్తక జ్ఞానం మాత్రమే కాకుండా కమ్యూనికేషన్, టీమ్‌వర్క్ వంటి నైపుణ్యాలు కూడా నేర్చుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. అనంతరం జిల్లా స్థాయిలో జరిగిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె. నాగరాజు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల కెరీర్ పై జ్ఞాన బోధన చేస్తున్న ఉపాధికల్పన అధికారి ప్రియాంక

## అడిషనల్ కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

**నారాయణపేట టౌన్, అక్టోబరు15 ప్రభాతవార్త:** పాఠశాల, కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం సమయానికి బస్సు నడిపించేలా చూడాలని ఆర్టీసీ అధికారులు విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్నారని బుధవారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ గత మూడు రోజులుగా దామరగిద్ద మండలం మల్ రెడ్డి పల్లి, లోకుర్తి, లింగారెడ్డిపల్లి,ఈ గ్రామాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉందన్నారు. విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని డిపో మేనేజర్ కు వినతి పత్రాలు ఇచ్చిన ఏమాత్రం స్పందన లేదన్నారు. డిపో మేనేజర్ దగ్గరికి వెళితే మీ గ్రామానికి రోడ్డు సౌకర్యం సరిగాలేని కారణంగా బస్సు పంపడం లేదు అని చెప్పడం జరిగింది. చేసేది లేక నారాయణపేట జిల్లా కలెక్టర్ ఆఫీస్ దగ్గరకు వెళ్లి అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ ఆశ్రయించవలసిన అవసరం వచ్చిందన్నారు. ప్రతినెల బస్సు పాస్ చార్జీలు చెల్లిస్తున్నాం కానీ మా గ్రామాలకు బస్సు రావడం లేదన్నారు. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా ఏ గ్రామాలకు కూడా బస్సు సౌకర్యం సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. విద్యార్థులు కాలినడక, ఆటో, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించవలసిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా స్పందించి విద్యార్థులకు ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించే విధంగా స్థానిక కలెక్టర్, ప్రజా ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యేవిద్యార్థులకు సమయానికి బస్సు సౌకర్యం కల్పించే విధంగా చూడాలని కోరారు, లేనియెడల భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నారాయణపేట డిపో ముందు భారీ ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధానకార్యదర్శి పవన్‌కుమార్ అధ్యక్షులు భానుప్రసాద్, ఎస్ఎఫ్ఐ మాజీ డివిజన్ కార్యదర్శి భీమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మహేష్,వెంకటేష్, విద్యార్థులు అనిల్, జగదీష్, వెంకటేష్, రమేష్, నరేష్ తదితరులు ఉన్నారు.



అడిషనల్ కలెక్టర్‌కు వినతి అందజేస్తున్న దృశ్యం

## స్కూల్ బస్సులు బంద్ చేయకండి సారూ..!

### సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహా ఆవేదన

**ఊట్కూర్, అక్టోబరు 15 ప్రభాతవార్త:** "నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు" అని మైక్ పట్టుకొని చెప్పే ప్రజా ప్రతినిధులు, అధికారులు అదే పిల్లల పాఠశాల బస్సులను రాజకీయ మీటింగులకు తరలించడం ఆవేదన కలిగిస్తోంది అని సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహా అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ప్రతిసారీ ముఖ్యమంత్రి సభలు, రాజకీయ నాయకుల మీటింగులు, పండుగలు, జాతర్ల సమయంలో స్కూల్ పిల్లల బస్సులను బంద్ చేసి ఆ బస్సులను రాజకీయ కార్యక్రమాలకు వినియోగిస్తున్నారని ఆయన విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రారంభమైన ఈ "సాంప్రదాయానికి" ఇప్పుడు కొత్త ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలుకుతారని ప్రజలు ఆశించారనీ, కానీ అదే పద్ధతి కొనసాగుతుండడం విచారకరమని అన్నారు. నేడు కర్నూలులో జరగనున్న ప్రధానమంత్రి సభ కోసం బుధవారం మధ్యాహ్నం నుంచే బస్సులు నిలిపివేయడం వలన బిజ్వార్, అవుసలోనిపల్లి, పెద్దజట్రం ప్రాంతాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నర్సింహా తెలిపారు. పిల్లలు 9 కి.మీ నడుచుకుంటూ పెద్దజట్రం గేట్ వరకు చేరుకుని కూడా బస్సులు రాక నిరాశ చెందినట్లు తెలిపారు. నడుచుకుంటూ వెళ్తున్నప్పుడు ప్రైవేట్ వాహనాలు ఆపే క్రమంలో ప్రమాదాలు జరిగితేబాధ్యత ఎవరుతీసుకుంటారని ఆయన ప్రశ్నించారు. సంబంధిత అధికారులుఈ అంశాన్ని ముఖ్య మంత్రి దృష్టికి తీసుకువెళ్లి, భవిష్యత్తులో స్కూల్ పిల్లల బస్సులను బంద్ చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.





బస్సులు లేకపోవడంతో నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

## నేడు జిల్లాస్థాయి చదరంగం పోటీలు

**ఉప్పునుంతల, అక్టోబరు15 ప్రభాతవార్త:** నేడు గురువారం స్థానిక పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 69వ జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం అధ్యక్షుడు, పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నేడు ఉదయం 9:30 గంటల నుంచి 69 వ జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తుండడంతో మండలంలోని అన్ని పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు హాజరు కావాలని ఆయన కోరారు.

## నీటి గుంతలో పడి వ్యక్తి మృతి

**మహబూబ్‌నగర్ (చిన్న చింతకుంట),అక్టోబరు15 ప్రభాతవార్త :** మండల పరిధిలోని గూడూరు గ్రామ సమీపంలో గల ఊక చెట్టు వాగులోని నీటి గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు కౌకుంట్ల మండలం తిరుమలపూర్ గ్రామానికి చెందిన దాసరి కృష్ణయ్య (58) ఈయన శ్రీ కురుమూర్తి దేవస్థాన ముందు బిక్షాటన చేసుకుంటూ జీవించేవాడు. మృతునికి కళ్ళు కనిపించవు బుధవారం ఉదయం నీటిగుంటలో మృతదేహం కనిపించడంతో గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా శవాన్ని బంధువులు తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు తెలిపారు. నీటి గుంతలో పడి మృతి చెందిన సంఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## పశువైద్య శిబిరంలో 277 పశువులకు టీకాలు



భూత్పూర్ పశువైద్య శిబిరంలో టీకాలు వేస్తున్న డాక్టర్ మధుసూధన్

**భూత్పూర్,అక్టోబర్15,ప్రభాతవార్త:** బుధవారం నుంచి ఆరంభమైన పశువైద్య శిబిరంలో తొలిరోజు భూత్పూర్‌లో మొత్తం 277పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ మధుసూధన్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలు, పట్టణాలు, శివారుగ్రామాలు, తండాలలో ఈ నెల 15నుంచి వచ్చే నెల 14వరకు నెలరోజుల పాటు పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తొలిరోజైన బుధవారం భూత్పూర్ పట్టణ కేంద్రంలోని పశువైద్యశాలలో నిర్వహించిన వైద్యశిబిరంలో 8 ఆవులు, 193గేదెలలు మొత్తం 277పశువులకు గాలికుంటు నివారణకు టీకాలు వేసినట్లు తెలిపారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి ప్రచారం



ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

**నారాయణపేట టౌన్, అక్టోబరు15 ప్రభాతవార్త:** హైద్రాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్ నగర్ డివిజన్ పరిధిలోని హబీబ్ ఫాతిమానగర్‌లోని 102,103, 104 బూత్ నంబర్‌లలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో భాగంగా బుధవారం బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు యస్. రాజేందర్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారి వెంట బిఆర్ఎస్ పార్టీ ఆ ప్రాంత నాయకులతో పాటు తదితరులు ఉన్నారు.

## ఎర్ర శేఖర్‌పై అనిరుధ్ రెడ్డి అక్కసు సరి కాదు

### పేట ముదిరాజ్ సంఘం నాయకులు మిర్చి వెంకటయ్య

**నారాయణపేట టౌన్, అక్టోబరు15 ప్రభాతవార్త:** బిసి ముదిరాజ్ వర్గానికి చెందిన మాజీ ఎమ్మె ల్యే ఎర్ర శేఖర్ పై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అహంకారంతో అక్కసు వెళ్లగక్కడం సరైంది కాదని ఆయన వ్యాఖ్యలను నారాయణపేట పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య, ఉపాధ్యక్షుడు పళ్ల వెంకట్‌రాములు, ముదిరాజ్ యువసేన అధ్యక్షుడు అపి రెడ్డిపల్లి రాము బుధవారంఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన రెండేళ్లకే ప్రజల విశ్వాసం నమ్మకం కోల్పోయి న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల మదిలో నిలిచిన మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్‌పై విమర్శలు చేయడం చూస్తే ఒకవేళ ఎర్ర శేఖర్ కాంగ్రెస్ లో చేరితే తన ఉనికి కే ప్రమాదమన్న అభద్రతా భావంతో ఉన్నారని స్పష్టం అవుతున్నదని అన్నారు. అందుకే అనిరుద్‌రెడ్డి ఎర్రశేఖర్ పై అనుచితమైన విమ ర్శలు చేస్తున్నారనీ అన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యేగా మూడు సార్లు ఎర్రశేఖర్‌ను గెలిపించుకున్న ఆ నియోజక వర్గ ప్రజలు సహించరని అన్నారు. రెడ్డి అహంకారంతో విమ ర్శలు చేస్తే రానున్న రోజుల్లో బిసిల దెబ్బ రుచి చూడక తప్పదని హెచ్చరించారు. ఇకనైనా వినయంగా మాట్లాడాలని హితవు పలికారు.

## లేబర్ అధికారికి సిఐటియు నాయకుల వినతి

**నారాయణపేట టౌన్, అక్టోబరు15 ప్రభాతవార్త:** అర్హులైన భవన నిర్మాణ కార్మికులు తెలంగాణ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా అందించే గుర్తింపు కార్డులను పొందాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బాల్ రామ్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పుంజనూరు ఆంజనేయులు పిలుపునిచ్చారు. బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో జిల్లా లేబర్ అధికారి కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులు గుర్తింపు కార్డులకోసం దరకాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణ పనులలో పనిచేస్తున్న కార్మికులు తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా గుర్తింపు కార్డులు పొందాలని కోరారు. గుర్తింపు కార్డు పొందిన సంవత్సరం తర్వాత సంక్షేమ పథకాలు అమలవుతాయని కార్మిక శాఖ అధికారి కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ కవిత తెలిపారు. కార్డ్ పొందిన భవన నిర్మాణ కార్మికులు తమ కూతురు పెళ్లికి రెండు కాన్పులకు 30 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహకారం అందుతుందని, భవన నిర్మాణ కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే 6లక్షల 30 వేల రూపాయలు, సహజ మరణం పొందిన ఒక్క లక్ష 30వేల రూపాయలు ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. ప్రతి భవన నిర్మాణ కార్మికుడు భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఇచ్చే గుర్తింపు కార్డులతో పాటు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఈశ్రామ్ కార్డును కూడా పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవననిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



దరకాస్తులు అందజేస్తున్న దృశ్యం

### ర్యాలంపాడు పునరావాస కేంద్రంలో

# పెండింగ్ పనులను త్వరతగతిన పూర్తి చేయాలి

■ గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్


సమావేశానికి హాజరైన ర్యాలంపాడు గ్రామస్తులు

**గద్వాల టౌన్ అక్టోబర్ 15, ప్రభాతవార్త:** ర్యాలంపాడు పునరావాస కేంద్రంలో వున్న పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ బి యం సంతోష్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. పునరావాస కేంద్రంలో అన్ని సదు పాయాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయబడుతున్నందున, గ్రామ ప్రజలు ఇక్కడికి వచ్చి ఇళ్లు నిర్మించి జీవితం కొనసాగించాలని కలెక్టర్ సూచిం చారు. బుధవారం ధరూర్ మండలంలో ర్యాలంపాడు పునరావాస కేంద్రంలోని సదుపాయాలు కల్పించే అంశమై జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్,గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తో కలిసి గ్రామస్తులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ర్యాలం పాడు గ్రామ ప్రజలుతమ భూములను అందజేయడం వలన, జిల్లాలో 1,80, 000 ఎకరాలకు సాగునీరు అందించే 4 టిఎంసిల రిజర్వాయర్ నిర్మాణం పూర్తయిందని తెలిపారు. భూములు కోల్పోయిన ప్రజలకు ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వాటిని పునరాసవ కేంద్రాలలో అందజేస్తోందని తెలిపారు. గ్రామ అభివృద్ధికోసం రోడ్లు, త్రాగునీరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాము, గ్రామ పంచా యతీ భవనాలు, సబ్ సెంటర్లు, అంగన్వాడి కేంద్రాలు, దేవాలయాలు,చర్చిలు లాంటి అన్ని అవసరాలను లేఅవుట్ ప్లాన్ ప్రకారం ప్రభుత్వం ఏర్పాటు చేస్తోం దని చెప్పారు. ప్రతి ప్లాన్‌కి అనుగుణంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. భూసేకరణలో 67 ఎకరాల 28 గుంటలు భూమిలో మొత్తం 823 ప్లాట్లను ఏర్పాటు చేయగా, ఇప్పటికే 695 ప్లాట్లును భూ నిర్వాసితులకు మంజూరు చేయడం జరిగిందని, సమస్యలు ఉన్న 5 ప్లాట్లను ఖాళీ ఉన్న ప్లాట్లలో మళ్లీ అందించడం జరుగుతుందని తెలిపారు. 78 ప్లాట్లలో నీరు నిలుస్తున్నందున, మట్టితో భర్తీ చేసే వాటిని లెవెల్ చేస్తామని తెలిపారు. అనుకూలంగా లేని మరో 14 ప్లాట్లను కూడా ఖాళీ ప్లాట్లలో మంజూరు చేయడం జరుగుతుందని, లేదా వాటికి సంబంధించిన నూతన భూసేకరణ కోసం తగిన చర్యలు తీసు కుంటామని తెలిపారు. విద్యుత్ సమస్యలు, త్రాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు లింక్ రోడ్లను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామానికి స్మశాన వాటికకు స్థలం కేటాయించడం జరుగుతుందని, అలాగే పెండింగ్‌లో ఉన్నషిఫ్టింగ్ చార్జీలను వెంటనే చెల్లించడం జరుగుతుందని తెలియజేశారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం ఈ గ్రామంలో 250 పైగా ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని, మంజూరైన ప్రతి ఒక్కరు తమ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం వారి ఖాతాల్లో నిధులు జమ అవుతాయని, అవసరమైతే మహిళా సంఘాల ద్వారా రుణాలు అందించబడతాయని తెలిపారు. అర్హులైన వారికి రెండో విడతలో లబ్ధి పొందేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**ర్యాలంపాడు ప్రజలత్యాగం చిరస్థాయిగా గుర్తుంటుంది : ఎమ్మెల్యే బండ్ల**

గద్వాల్ శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ, గద్వాల్ అభి వృద్ధిలో ర్యాలంపాడు గ్రామం చేసిన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపో తుందని అన్నారు. రైతులు తమ స్వంత వ్యవసాయ భూములను త్యాగం చేయడం వలన, 4టీఎంసీ రిజర్వాయర్ నిర్మాణం సాధ్యమై, దాని ద్వారా 1,80,000ఎకరాలకు సాగునీరు అందించడం జరిగిందని పేర్కొన్నారు. రైతుల త్యాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుందని, వారికి తగిన గౌరవం, సదుపాయాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. గతంలో ముంపుకు గురైన ఆలూరు, చిన్నోనిపల్లి, నాగర్‌దొడ్డి తదితర గ్రామాల్లో ఇప్పటికే అవసరమైన అన్ని రకాల సదుపాయాలు అందజేశామని తెలిపారు. ర్యాలం పాడు గ్రామానికి కూడా అదే విధంగా అన్ని వసతులు కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ర్యాలంపాడు గ్రామంలో ఎక్కువ మంది ఇందిరమ్మ ఇళ్లకు అర్హులుగా గుర్తించి వారికి ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఆర్‌ఆర్ సెంటర్ లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, ప్రజలు ఎవరు కూడా ఆందోళన చెందకూడదని, అధికారులందరూ ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. అనంతరం ప్రజలు తమ సమస్యల పట్ల జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేకు వినతి పత్రాలను అందజేయగా, వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ, ఆర్డీవో అలివేలు, తహసీల్దార్ నరేందర్, నీటి పారుదలశాఖ ఈ.ఈ శ్రీనివాసులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో వైద్య శిబిరం



**గద్వాల టౌన్ (అలంపూర్) అక్టోబర్15, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని ఉన్న యూనియన్ బ్యాంక్ మేనేజర్ రవి కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో, విజిలెన్స్ అవేర్నెస్ వారోత్స వాలను బుధవారం రోజు యూనియన్ బ్యాంకులో అలంపూర్ మండల పరిధిలోని ఉన్న ప్రజలకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంకు ఓమ్ని హాస్పిటల్ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్.ఇందు ప్రకాష్,తన వైద్య సిబ్బందితో ప్రజలకు ఉచిత వైద్య శిబిరం ద్వారా మెరుగైన వైద్యమును అందించి ప్రజలకు పలు సూచనలు సలహాలను అందించారు. ప్రజలకు గుండె వ్యాధి మరియు ఇతర వ్యాధులు పరీక్షించారు. గుండె వ్యాధి, షుగర్, బిపి, ఇతర రోగాలకు ఉచితంగా మందులను అందించారు. ఈ శిబిరంలో దాదాపు130 మంది ప్రజలు పాల్గొని తమ వైద్యమును చూయించు కోవడం జరిగిందని యూనియన్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్ రెడ్డి తెలిపారు. ప్రజలు ఇంతటి చక్కటి వైద్య శిబిరంలో పాల్గొని బ్యాంకు అధికారులకు, ఓమ్ని వైద్య సిబ్బందికి సహకారం అందిం చడం జరిగిందని అన్నారు. అలంపూర్ యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరం చాలా సంతోషకరమని అలంపూర్ మరియు మండల ప్రజలు యూనియన్ బ్యాంకు సిబ్బందికి, ఓమ్ని హాస్పిటల్ వైద్యబృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలి పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్‌సిబ్బంది, యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ఉజ్వల, మనో రంజిత, ఆంజనేయులు, సురేష్, పవన్, అలంపూర్ గ్రామ పెద్దలు ఏ.జీ.మహేష్ గౌడ్, రాధాకృష్ణ, నాగ శేఖర్ గౌడ్, కుసుపాటి హరినాథ్ రెడ్డి, నాగ శేషన్న నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### తిరుపతి అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొన్న
## ధన్వాడ శ్రీవృద్ధ మల్లికార్జున స్వామి భజన బృందం


హరినామ సంకీర్తనలో పాల్గొన్న భజన బృందం

**ధన్వాడ, అక్టోబరు 15 ప్రభాతవార్త:** ధన్వాడ మండల కేంద్రంలో ఉన్నటువంటి శ్రీశ్రీ వృద్ధ మల్లికార్జున స్వామి దేవస్థానం భజన బృందం, తిరుమలతిరుపతిలో అఖండ హరి నామ సంకీర్తన భజన కార్యక్రమంలో బుధవారంఉదయం 6గంటల నుండి 8 గంటల వరకు పాల్గొనడం జరిగిం ది. భజన మండలి అధ్యక్షులు పటేల్ నర్సింలు మాట్లాడుతూ గత 10 సంవత్సరాలు తిరుమల తిరుపతి అఖండ నామ సంకీర్తన భజన కార్యక్రమంలో పాల్గొంటున్నామని సంవత్సరంలో రెండుసార్లు తిరుమల తిరుపతి ఆహ్వానం మేరకు భజన బృందం 15 మంది సభ్యులు పాల్గొం టున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ రావు, వరస్వామి, అనిల్, అర్జున్, వెంకటయ్య, గణేష్, అర్జున్, సుభాష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్యశాల లేక రైతులకు ఇబ్బందులు

**ధన్వాడ, అక్టోబరు 15 ప్రభాతవార్త:** ధన్వాడ మండలంలోని మందిపల్లె గ్రామంలో పశువైద్యశాల లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు పశువుల ఆరోగ్య సేవలు అందించేందుకు 3 కిలోమీటర్లు ధన్వాడకు నడుచుకుంటూ వెళ్లి పశువులకు చికిత్స అందిస్తున్నారు. గత కొన్ని సంవ త్సరాల క్రితం పశువైద్యశాలను కూల్చివేయడం జరిగింది. ఇప్పటికీ కొత్త పశువైద్యశాలను నిర్మించలేకపోయారు. గ్రామంలో పశు వైద్యశాల లేక పశువులు చనిపోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పశువైద్యశాల నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## బస్వాయిపల్లిలో గాలికుంటు వ్యాధి టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

**దేవరకద్ర, అక్టోబరు 15 ప్రభాతవార్త :** దేవరకద్ర మండలం బస్వాయి పల్లి గ్రామంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలు మరియు ఏడవ విడత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ అధికారి డా. బి మధు సూదన్‌గౌడ్, అసిస్టెంట్ డైరెక్టర్ డా. మమత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువైద్య కేంద్ర పరిధిలో ఉన్న రైతులందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆరు నెలలు వయసు దాటిన ప్రతి పశువుకు ఈ టీకాలు వేయించాలని అన్నారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువులలో పనిచేసే సామర్థ్యం తగ్గుతుందని, అలాగే పాడి పశువులలో పాల ఉత్పత్తి తగ్గుతుందని అన్నారు. రైతులు గాలికుంటు వ్యాధి సోకక మునుపే పశువులకు టీకా లు వేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డా. వెంకటేశ్వర్లు, దేవరకద్ర పశువైద్యాధికారి డా. ప్రవీణ్, మహబూబ్‌నగర్ రూరల్ మండలం పశువైద్యాధికారి డా. జిషాన్ అలీ, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఇంచార్జ్ ఎంఆర్‌ఓ దీపిక, ఎంపిఓ లక్ష్మీ, నర్సింహులు, కాంగ్రెస్ మండలం పార్టీ అధ్యక్షుడు అంజిల్ రెడ్డి, బస్వాయిపల్లి గ్రామ కాంగ్రెస్ సినియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి, బాలరాజ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విక్రవర్ధన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో కోఆర్డినేటర్ గోవర్ధన్, మండల నాయకులు శివ కుమార్, ఫక్రుద్దీన్, సురేష్, ఆటో సాయిలు, గద్ద గూడెం పూర్ణిత, జాఫర్, రాములు, గోపన్ పల్లి సురేందర్ రెడ్డి, డోకుర్ రామకృష్ణారెడ్డి, వాకిటి లక్ష్మీనారాయణ, శ్రీహరి, గ్రామ యూత్ ఉపాధ్యక్షుడు బోయ రాజు, గ్రామ ప్రజలు, రైతులు, దేవరకద్ర మండలం పశువైద్య సిబ్బంది, గోపాల్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

### ర్యాష్ డ్రైవింగ్.. బైక్ సీజ్

**నారాయణ పేట, అక్టోబరు15 ప్రభాతవార్త:** నారాయణపేట టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యం లో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో పబ్లిక్ ప్రదేశాల్లో ఓపెన్ డ్రింకింగ్ చేస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. అలాగే అధిక శబ్దం వచ్చే ప్రత్యేక సైలెన్సర్‌లతో రాష్ డ్రైవింగ్ చేస్తున్న బైక్‌లను సీజ్ చేసి కోర్టులో సబ్మిట్ చేశారు. శబ్ద కాలుష్యం, మద్యం దుర్వినియోగం పట్ల పోలీసులు సహ న విధానం అమలు చేస్తున్నారని ఎస్ఐ తెలిపారు. ప్రజల భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉన్నారని అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ సంతోష్


హాజరు పట్టికను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల టౌన్ అక్టోబర్15, ప్రభాతవార్త:** విద్యార్థులు మంచి ఫలి తాలు సాధించేలా వారికి అర్థమయ్యే రీతిలో బోధించాలని జిల్లా కలెక్టర్‌బి.ఎం. సంతోష్ ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధ వారం జిల్లా కేంద్రంలోని బురదపేట ప్రభుత్వ ఉన్నత పాఠశా లను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో పాఠాలు చదివించారు. ప్రత్యేక తరగతు లను ప్రతిరోజు కచ్చితంగా నిర్వహించాలని, విద్యార్థులు సద్విని యోగం చేసుకునేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించా లన్నారు. పదవ తరగతి ఫలితాల్లో జోగులాంబ గద్వాల జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉండేలా చదవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఎఫ్ ఆర్ ఎస్ (ఫేస్ రికగ్నైజింగ్ సిస్టం) లో హాజరు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారా అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతం పెరగాలని, ఏమైనా సమస్యలు ఉంటే పేరెంట్స్ సమావే శాల్లో చర్చించి అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో మరుగుదొడ్ల కొరత ఉందని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఎలాంటి సమస్యలున్న పరిష్కరిస్తామని కలెక్టర్ తెలియజేశారు.

## కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


బిజెపిలోకి ఆహ్వానిస్తున్న బంగ్లా లక్ష్మీ కాంతారెడ్డి

**అమరచింత అక్టోబర్15, ప్రభాతవార్త:** దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బిజెపి కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని బిజెపి రాష్ట్ర నాయకులు, బంగ్లా లక్ష్మీ కాంతరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం అమరచింత మండలంలోని నందిమల్ల గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కలలో అనేక హామీలు ఇచ్చిన అమలుచేయడంలో పూర్తిగా వైఫల్య ం చెందిందని ఆయన విమర్శించారు. ఎన్నికలలో కళ్యాణ లక్ష్మికి తులం బంగారం, మహిళలకు 2500, విద్యార్థులకు స్కూటీలు, అనేక వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ పార్టీ డ్రామా కాంగ్రెస్ పార్టీ అని ఆయన ఎద్దేవా చేశారు. పాలమూరు ఎంపీ డీకే అరుణమ్మ సహకారంతో ఆయా గ్రామాలలో బీటీ రోడ్లతో పాటు తాగునీరు సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు అందిస్తున్నామని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీకి ఆదరణ పెరుగుతుందని వచ్చే స్థానిక ఎన్నికల లో ప్రజలు బిజెపి పార్టీకి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. అనంతరం నందిమల్ల గ్రామంలో వివిధ పార్టీలకు చెంది న కార్యకర్తలు బిజెపి పార్టీలోకి బంగ్లా లక్ష్మీ కాంత్ రెడ్డి వారికి కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి అమర చింత మండల అధ్యక్షురాలు, మంగ లావణ్య, మండల కార్య దర్శి, వినోద్ కుమార్, బిజెపి సీనియర్ నాయకులు నరాల నారా యణ, క్యామ భాస్కర్, వెంకటేశ్వర్లు, భీమ్సేన్, మల్లారెడ్డి, భీమ్ రెడ్డి, ఆయా గ్రామాల బిజెపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## పత్తి చేనుల పనులకు పిల్లలను తరలిస్తే కఠిన చర్యలు

ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్

**లింగాల, అక్టోబరు 15 ప్రభాతవార్త:** చదువుతున్న పిల్లలను పనులకు వాహనాల్లో తరలిస్తే అట్టి వాహన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ హెచ్చరిం చారు. బుధవారం లింగాల మండల పరిధిలోని బాకారం, కోమటి కుంట ఎక్స్ రోడ్డులో వాహనాలను నాగర్ కర్నూల్ జిల్లా ఏఎస్ టియు, సిసిఎస్ శంకర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వర్లుగౌడ్ మాట్లాడుతూ వాహనాల లోపరిమితికి మించి కూలీలనుతరలించరాదని, వాహనాలకు సంబంధించిన సరైనపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను వాహనాలలో తరలించరాదని, పిల్లలు పాఠశాలలో ఉండాలి తప్ప పత్తి చేలలో ఉండరాదని సూచించారు. అదేవిధంగా సీ టీమ్ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలను ఎవరైనా వేధిస్తే వెంటనే షీ టీమ్‌కు తెలియజేయాలని సూచించారు. 15 వాహనా లు తనిఖీలు నిర్వహించి అందులో పత్తి చేనుకు తరలిస్తున్న పది మంది పిల్లలకు విముక్తి కల్పించారు. షీటీమ్ ఎస్సై రజిత, ఏఎస్ఐ విజయలక్ష్మి ,ఏఎస్‌టియు జానకి రాములు, షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ పద్మ, వెంకటేష్. కోనేరు ఎన్జీవో ప్రాజెక్టుకోఆర్డినేటర్ ఆంజనేయులు, ఏరియా కోఆర్డినేటర్లు శ్రీనివాస్ యాదవ్, జాకీర్ హుస్సేన్ కమ్యూనిటీ మొబిలైజర్ కల్పన చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ప్రమీల, పోలీస్ సిబ్బంది మధు, రాజేందర్ పాల్గొన్నారు.

## బీసీ సోదరులు పోరాటానికి సిద్ధం కావాలి

**బిజినేపల్లి, అక్టోబరు 15 ప్రభాతవార్త:** బీసీలను దశాబ్దాలుగా పాలకులు మోసం చేస్తున్నారని ఇప్పటికైనా బీసీ రిజర్వేషన్ల సాధన కోసం మరో స్వతంత్ర పోరాటంలా ఉద్యమాలను ఉధృతం చెయ్యాలని ఈర్ల భూపేష్ బీసీ సమాజానికి పిలుపునిచ్చారు. బుధవారం సిపిఐ పార్టీ మండల సమితి 18 వ తేదీన జరిగేటటువంటి బందుకు పూర్తిస్థాయి మద్దతు తెలుపుతున్నట్లు వివరించారు. ఈర్ల భూపేష్ మాట్లాడుతూ బీసీలను పాలకులందరూ పదే పదే మోసం చేస్తున్నారని 56 పైగా ఉన్న బీసీలకు కేవలం విద్యా ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ మోసం చేస్తున్నారని అన్నారు. ఐదు శాతం కూడా లేని అగ్రవర్ణాలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ ద్వారా రిజర్వేషన్లను ఇస్తున్న మోడీ ప్రభుత్వం బీసీలను ఎందుకు పట్టించుకోవట్లేదని ప్రశ్నించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇప్పటికైనా దేశవ్యాప్తంగా జనగణన, కులగనన చేసి బీసీలకు దామాషా పద్ధతి ప్రకారం రిజర్వేషన్లు చట్టసభలతో పాటు విద్య ఉద్యోగ రంగాల్లో కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కులగననలో బీసీల వాట 56 తేలిందని వీరందరికీ రిజర్వేషన్ ఇవ్వడానికి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో రిజర్వేషన్ అంశాన్ని చేర్చాలని సిపిఐ పార్టీగా డిమాండ్ చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో బీసీ సమాజాన్ని ఏకం చేసి మేమెంతో మాకంత వాటా అని పోరాటాలను తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంగంపేట శ్రీనివాసులు, చిన్నపాక శ్రీనివాసులు, మల్లికేడి శ్రీనివాసులు, షాకుల మోహన్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 42 శాతం రిజర్వేషన్లకై జరగబోయే చలో బీసీల గర్జన సభకు అఖిల పక్షాల పిలుపు


మాట్లాడుతున్న బిసి అఖిలపక్ష నాయకులు

**మక్తల్ టౌన్, అక్టోబరు 15 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలో బీసీల అఖిల పక్ష నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జరగబోయే చలో బీసీల గర్జన బీసీలకు 42 రిజర్వేషన్లకై రాయల్ ఫంక్షన్ హాల్ లో జరగబోయే సభకు పెద్ద ఎత్తున కదలి రావాలని అఖిలపక్ష నాయకులు పిలుపునివ్వడం జరి గింది. మక్తల్ అసెంబ్లీ పరిధిలో ప్రతి మండలం నుండి ప్రతి గ్రామం నుండి ఎద్దుల బండి కట్టుకొని పెద్ద ఎత్తున కదలి రావాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలపై రిజర్వేషన్లను సాధించుకోవాలి అని ఆత్మగౌరవం కొరకు ప్రతి బీసీ బిడ్డలు, రాజకీయ మేధావులు, బీసీ కుల సంఘాల నాయకులు, ప్రతి ఒక్కరు కదలి రావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ చేయి చేయి కలుపుతూ "చలో బీసీల గర్జన సభను"విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవి నరసింహ, ఒబ్లపూర్ తిమ్మప్ప, ఉజ్జెల్లి బస్వరాజ్ ,హిందూపూర్, ఆంజనేయులు, సత్యరం ఆంజనేయులు, శివలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఏఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్‌ను కలిసిన బిఆర్ఎస్ నాయకులు

**అయిజ అక్టోబర్ 15, ప్రభాతవార్త:** మండలంలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇప్పటికే కొందరు కాంగ్రెస్ పార్టీలో చేరగా త్వరలో ఇదే పార్టీకి చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాదులోని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ని బిఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల అభివృద్ధి ధ్యేయంగా మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ లో చేరేందుకు సన్నద్ధ మవుతున్నట్టు వారు తెలిపారు. కలిసిన వారిలో మాజీ సింగల్ విండో అధ్యక్షులు సంకాపురం రాముడు ,మాజీ జెడ్పిటిసి పులికల్ చిన్న హనుమంతు, సిందనూరుబ్రహ్మయ్య, తూముకుంట శ్రీనివాస్ గౌడ్, కృష్ణ, కేసారంల తోపాటు కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీ ప్రకాష్‌గౌడ్, ఆర్ శ్రీధర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కొంకల నాగరాజు, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ దీపక్ ప్రజ్ఞ మరియు మండల నాయకులు ఉన్నారు.

### డీసీసీ అధ్యక్షుడి నియామకం కోసం..
## నేడు మండలాల సమన్వయ కమిటీ సమావేశం

**భూత్పూర్, అక్టోబర్ 15, ప్రభాతవార్త:** జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) నూతన అధ్యక్షుడి నియామకం కోసం దేవరకద్ర నియోజక వర్గంలోనిమూడు మండలాలకు(భూత్పూర్, అడ్డాకుల, మూసాపేట) సంబంధించి గురువారం అడ్డాకులలో దేవరకద్ర ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు గవినోళ్లమధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) అధ్యక్షతన కాంగ్రెస్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తున్న ట్లు భూత్పూర్ మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి నవీన్‌గౌడ్‌లు బుధవారం ఒసంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఏఐసీసీ, టీపీసీసీ పరిశీలకులు హాజరౌతున్నారని తెలిపారు. ఈసమావేశానికి భూత్పూర్, అడ్డాకుల, మూసాపేట మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, యువజన, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ, ఐఎన్‌టీ యూసి, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని వారు కోరారు.

## తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల వేతనాలు వెంటనే చెల్లించాలి



**ధన్వాడ, అక్టోబరు15 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఒకటి తారీకు నాడు వేతనాలు చెల్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష పనిచేస్తున్న ఉద్యోగులకు ఇప్పటివరకు వేతనాలు చెల్లించలేదు. వెంటనే వేతనాలు చెల్లించి సమస్యను పరిష్కరించాలని ఆవేదన వ్యక్తపరుస్తూ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నీరటి రాఘవేందర్‌నాయుడు, సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు కుమ్మరి వెంకట్రా ములు, నారాయణ చారి, గంగమ్మ , జయేంద్ర, లావణ్య, రఫియా, శివమ్మ, శ్రావణి, అంజమ్మ, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్



**ఉట్కూర్, అక్టోబరు15 ప్రభాతవార్త:** ఉట్కూర్ మండలం పగిడి మర్రి గ్రామంలో లయన్స్ క్లబ్ నారాయణపేట వారి ఆధ్వర్యంలో ఈరోజు ఆరోగ్య శిబిరం (హెల్త్ క్యాంప్) నిర్వహించబడింది. గ్రామ ప్రజలకు ఉచిత వైద్యసేవలు, ఆరోగ్య పరీక్షలు, అవసరమైన ఔష ధాలు అందించగా ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు, బి.కె.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ గవినోళ్ల బాలకృష్ణారెడ్డిని మాజీ సర్పంచ్ బసవరాజుగౌడ్, గ్రామ స్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల నాయకులు జనార్దన్‌రెడ్డి, నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ మణెమ్మ, మాజీ జెడ్పిటిసి లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, విష్ణువర్ధన్ రెడ్డితో పాటు వైద్య బృందం పాల్గొని సేవలు అందించారు. గ్రామస్థులు లయన్స్ క్లబ్ నారాయణపేట, ఫౌండేషన్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉట్కూర్ కొత్త ఇంచార్జ్ ఎంపీడీవోగా లక్ష్మీనరసింహరాజ్

**ఉట్కూర్, అక్టోబరు 15 ప్రభాతవార్త:** ఉట్కూర్ మండలానికి కొత్త ఇంచార్జ్ ఎంపీడీవోగా లక్ష్మీనరసింహరాజ్ బాధ్యతలు స్వీకరిం చారు. మునుపటి ఎంపీడీవో ధనుంజయ గౌడ్ బదిలీపై ఇతర మండలానికి వెళ్ళడంతో ఈ మార్పు జరిగింది. లక్ష్మీనరసింహరాజ్ గారు బాధ్యతలు చేపట్టిన అనంతరం మాట్లాడుతూ ఉట్కూర్ మండల అభివృద్ధి కోసం తాను కృషి చేస్తానని, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సంఘాలు, స్వయం సహాయ సమూహాల ప్రోత్సాహం, మౌలిక వసతులఅభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానని పేర్కొన్నారు .మండలంలోని అన్ని శాఖల సిబ్బందితో సమన్వయం సాధిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేస్తానని ఆయన వెల్లడించారు. ప్రజలకు పరిపాలన మరింత చేరువ కావడమే తన లక్ష్యమని అన్నారు. ఇంచార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన సందర్భం గా ఉట్కూర్ మండల అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు లక్ష్మీనరసింహరాజ్‌ను పూలమాలలతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

## దశదినకర్మలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**రాజాపూర్, అక్టోబరు 15 ప్రభాతవార్త:** రాజాపూర్ మండలం రాయపల్లి గ్రామానికి చెందిన సాక్షి దినపత్రిక పాత్రికేయులు నేరళ్ల గణేష్ గౌడ్ మాతృమూర్తి గత వారం రోజుల క్రితం మృతి చెందడం జరిగింది. బుధవారం రాయపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన దశదినకర్మలో మాజీ మంత్రి, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి పాల్గొని నేరళ్ల భాషమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ పెద్దను కోల్పోయిన గణేష్ కుటుంబ సభ్యులకుతన ప్రగాఢసానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో పట్ల ప్రభాకర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, అభిమన్యురెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింలు, బచ్చిరెడ్డి, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్త లు, గ్రామస్తులు పాల్గొన్నారు.


నేరళ్ల భాషమ్మ చిత్రపటానికి
పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



# గొప్ప ధన్య జీవి అబ్దుల్ కలాం

## - జెపీఎన్‌సీఈ కళాశాల ఛైర్మన్ కేఎస్ రవికుమార్

**మహబూబ్‌నగర్, అక్టోబరు15,ప్రభాతవార్త:** అజాత శత్రువుగా ఎదిగిన అతను గొప్ప ధన్య జీవి అని జెపీఎన్‌సీఈ కళాశాల ఛైర్మన్ కేఎస్ రవికుమార్ తెలిపారు. జయప్రకాశ్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో, మాజీ రాష్ట్రపతి, భారత రత్న డా.ఏపిజె అబ్దుల్ కలాం 94 వ జయంతి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ కేఎస్ రవికుమార్ అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ ప్రసంగిస్తూ డా. అబ్దుల్ కలాం ఆరుగురు ప్రధాన మంత్రుల దగ్గర డిఫెన్స్ సలహాదారునిగా పని చేసిన గొప్ప వ్యక్తి అని తెలిపారు. మిస్సైల్ పితామహుడు అని రక్షణ రంగములో అతను చేయని రంగము లేదని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి, విద్య శ్రేయస్సుకు అతను గొప్ప కృషి చేశాడని తెలిపారు.అతనికి బోధన రంగము అంటే చాల ఇష్టమని,అతను షిల్లాంగ్ లోని ఐఐఎంలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ చివరి శ్వాస విడిచాడని అని అటువంటి మహానుభావుని యొక్క సేవలను మనం తప్పని సరిగా స్మరించుకోవాలని తెలియ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గాడా.కృష్ణమూర్తి, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ వీఈ చంద్రశేఖర్ , పరీక్షల నిర్వహణ అధికారి కోటల సందీప్ కుమార్, పాలిటెక్నిక్ అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



**భూత్పూర్, అక్టోబర్ 15,ప్రభాతవార్త :** తన సాంకేతిక పరిజానంతో భారత అంతరిక్ష పరిశోధనలో తనకంటూ ఓ ప్రత్యేకత,గుర్తింపును తెచ్చుకుని భారత మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండి యాగా పేరొందిన భారత మాజీ రాష్ట్ర పతి స్వర్గీయ ఎపిజె అబ్దుల్ కలాం 95వ జయంతి వేడుకల్ని భూత్పూర్ పట్టణ,రూరల్ ప్రాంతాలలో మేధావులు, విద్యావంతులు, వివిధ పార్టీల నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. భూత్పూర్ మున్సిపాలిటీ పరిధి లోని అమిస్తాపూర్ పట్టణంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి కలాం చేసిన సేవల్ని పలువురు నేతలు కొనియా డారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు మొహ్మద్ ఫారూక్,బీఆర్ఎస్ నాయకుడు మొహ్మద్ సాధిక్‌లతో పాటు ఇతర నాయకులు జహం గీర్‌బాబా,మొహ్మద్ షాకీర్ ,మొహ్మద్‌రియాజ్, తిరుపతయ్య, భాస్కర్,ఫజల్,ఉస్మాన్, ఇనాయ త్,ఫిరోజ్,ఖాసిం ,సద్దాం, ఆమేర్,జావెద్ ఇతర నాయకులు పాల్గొన్నారు.



**ఊట్కూర్, అక్టోబరు15 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండలంలోని ఎంపీపీ ఎస్ పెద్దపొర్ల పాఠశాలలో భారత మాజీ రాష్ట్రపతి, మిసైల్ మాన్ ఆఫ్ ఇండియా డా. ఏపిజె అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింగప్ప మాట్లాడుతూ, అబ్దుల్ కలాం శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా భారతదేశానికి విశేష సేవలు అందించారు. అగ్ని, ఆకాష్, పృథ్వి, త్రిశూల్, నాగ్ వంటి మిసైల్‌ల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. ఆయన భారతదేశాన్ని ప్రపంచ అగ్రశ్రేణి దేశాల సరసన నిలబెట్టారు" అని అన్నారు. తదుపరి ఆయన మాట్లాడుతూ, అబ్దుల్ కలాం జీవితం ప్రతి విద్యార్థికి స్ఫూర్తి ప్రదాత. ఆయన చెప్పిన కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి. కల అంటే నిద్రలో వచ్చేది కాదు, నిద్ర లేకుండా చేసేది అనే మాటలు ప్రతి ఒక్కరికీదారి చూపుతాయి" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, రాజశ్రీ, అశోక్, శారద తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.



**ఎర్రవల్లిలో:** మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏ.పి.జె అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని బుధ వారం ఎర్రవల్లి మండల కాంగ్రెస్ నాయ కులు చౌరస్తాలో అయన చిత్రపటా నికి పూలమాల వేసి నివాళులర్పిం చారు..ఈ సందర్భంగా భారతరత్న మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవల ను కొని యాడారు. ఈ కార్యక్రమంలో ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్. అలంపూర్ తాలూకా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఎర్రవల్లి మాజీ సర్పంచ్ జోగుల రవి. మాజీ సర్పంచ్ జయచంద్రరెడ్డి. సోమనాద్రి. తిమ్మారెడ్డి. నారా యణ నాయుడు. నారాయణ యాదవ్. అల్లా బకాష్. అంజి సాగర్.రాజ్ కుమార్. లింగ రాజు. ఆకుల భాష. సత్యం తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**నారాయణపేట టౌన్, అక్టోబరు 15 ప్రభాతవార్త :** భారత క్షి పణి పితామహుడు, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి, ప్రపంచ విద్యార్థి దినోత్సవ సందర్భంగా జాజాపూర్ ఉన్నత పాఠశాల లో విద్యార్థులు కలాం... సలాం ఆకృతిలో ఏర్పడి నివాళులర్పించారు. అబ్దుల్ కలాం చిత్రప టానికి ఉపాధ్యాయ బృందం పూలమాలను సమర్పించి నివాళులు అర్పించారు. కలాం జీవిత చరిత్రను విద్యార్థులకు డిజిటల్ టీవీలలో చూపించి, విద్యార్థుల లక్షణాలను కలాం జీవితం నుండి స్వీకరించాల్సిన అద్భుతమైన గుణాలను చక్కగా వివరించి విద్యార్థులకు ప్రేరణ కలిగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విజయ, మధుసూదన్, లక్ష్మణ్, నరసింహ, నిర్మల, శిరీష, మాణిక్ తదితరులు ఉన్నారు.

## నూతన జిల్లా ఎస్పీ డా.వినీత్‌ని కలిసిన పలువురు అధికారులు

**నారాయణ పేట, అక్టోబరు 15 ప్రభాతవార్త :** జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, అడిషనల్ పి పి.సురేష్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీ మపతి గౌడ్‌లు ఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రత పరిరక్షణలో అభివృద్ధి అంశాలపై న్యాయ పోలీస్ వ్యవస్థల మధ్య సమన్వయ కేసులు వేగవంతమైన పరిష్కారం వంటి వాటిపై పరస్పరం చర్చలు జరిపారు.

## జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఊట్కూర్ గురుకుల విద్యార్థిని దీపిక ఎంపిక



**ఊట్కూర్, అక్టోబరు15 ప్రభాత వార్త:** తెలంగాణ రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 22 నుండి 24 వరకు మహ బూబాబాద్ జిల్లా నెల్లికుదురు లో జరిగిన 44వ జూనియర్ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలలో నారాయణపేట జిల్లా ఊట్కూర్ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న వి. దీపిక నారాయణపేట జిల్లా బాలికల జట్టు తరపున ప్రతిభ కనబర్చి నాలుగవ స్థానం సాధించింది.దీని ఫలితంగా ఆమె జాతీయ స్థాయి జూనియర్ బాలికల షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక అయ్యింది.ఈ సందర్భంగా అక్టోబర్ 15న మక్తల్ (ఊట్కూర్) బాలికల గురు కుల పాఠశాలలో ప్రిన్సిపల్ మంజుల, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. గోపాలం ఘనంగా సన్మానించి అభినందించారు. జాతీయ స్థాయి పోటీలు నవంబర్ 5నుండి 10 వరకు ఉత్తరప్రదేశ్ ఘజియా బాద్‌లో జరగనున్నాయని, దీపిక తెలంగాణ జట్టు తరపున పాల్గొననున్నట్లు ప్రిన్సిపల్ మంజుల తెలిపారు. ఆమె మాట్లాడుతూ మా పాఠశాల విద్యార్థినులు క్రీడల్లో రాణించడం గర్వకారణం. దీపిక, కళ్యాణి, హేమలత వంటి విద్యార్థినులను శిక్షణనిచ్చి జాతీయ స్థాయికి తీసుకెళ్లిన కోచ్ బి. గోపాలం, పీఈటీ లావణ్య కృషి ప్రశంసనీయం" అని పేర్కొన్నారు. అలాగే క్రీడాకారిణులకు అవసరమైన పూర్తిసహకారం అందిస్తానని తెలిపారు.రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. గోపాలం మాట్లాడు తూ బాలికలు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు వెలుగులు విరజిమ్ముతుంది. క్రీడల సర్టిఫికెట్లు స్పోర్ట్స్ కోటాలో ఉన్నత విద్యకు, ఉద్యోగఅవకాశాలకు దోహదం చేస్తాయి.కృషి, పట్టుదలతో ముందుకు సాగండి" అని విద్యార్థినులకు సూచించారు. అలాగే రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొన్న కళ్యాణి, దీపిక, హేమలత, రాణి, నవనీత, లక్ష్మీ ప్రియా, నీరజలకు సర్టిఫికెట్లు అందజేశారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలలో పాల్గొన్న తేజస్విని, బ్లెస్సీలను కూడా ఘనంగా సన్మానించారు.జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొనుటకు కృషి చేసిన కోచ్ బి. గోపాలం, పీఈటీ లావణ్యలను ప్రిన్సిపల్ మంజుల ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినులను హర్షాతిరేకాలతో అభినందించారు.

# మన పీయూ విశ్వవ్యాప్తం



- ఒక్క భవనంతో మొదలై..పదుల సంఖ్యలో నిర్మాణమై..
- వేల మంది పట్టభద్రులు..
- ఎన్నో ప్రత్యేకతలు..మరెన్నో విజయాలు..
- పాలమూరు విశ్వవిద్యాలయం నాలుగో స్నాతకోత్సవం నేడు
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 15, ప్రభాత వార్త:** 2008లో ఒక్కటి మొదలై నేడు పదుల సంఖ్యలో భవనాలతో తన వైభవాన్ని చాటుతూ పాలమూరు ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తం చేసేలా ఎన్నో పరిశోధనలు, మరెన్నో విజయాలు, ఎన్నో ప్రత్యేకతలతో అభివృద్ధిలో ముందుకు సాగుతున్న పాలమూరు విశ్వవిద్యాలయం మరో మైలు రాయిని చేరుకుంటున్నది. గురువారం విశ్వవిద్యాల యంలో నాలుగో స్నాతకోత్సవ వేడుక అందుకు వేదిక కానున్నది. ఈ వేడుకకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈనేపథ్యంలో పాలమూరు విశ్వవిద్యాలయం ప్రత్యేకతలు, అభివృద్ధిపై ప్రత్యేక కథనం.

**పీయూ చరిత్ర, ప్రత్యేకత..**

పాలమూరు యూనివర్సిటీ ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో భాగంగా పిజి సెంటరుగా ఉండేది. 2008-09 విద్యా సంవత్సరం నుంచి ఈ విశ్వవిద్యాలయంలో తరగతులు ప్రారంభ మయ్యాయి. ప్రారంభంలో ఎం.ఎ. (రాజనీతి శాస్త్రం), ఎం.బి.ఏ., ఎం.సీ.ఏ., ఎం.కాం.,ఎమ్మెస్సీ కోర్సులు ప్రారంభించారు. 2009లో బీఫార్మసీ, 2010లో ఎంసీడబ్ల్యూ తదితర కోర్సులు కూడా ప్రారంభించడంతో ప్రస్తుతం మొత్తం 14 కోర్సులు కలిపి 1800 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాలలు ఈ విశ్వవిద్యాలయం పరిధిలోకి వచ్చాయి. ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్ 2021, మే 23న పాలమూరు విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్‌గా నియమితుడయ్యాడు. 2010 నవంబరు 12న పాలమూరు విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్. (జాతీయ సేవా పథకం) విభాగం ఆధ్వర్యంలో 2,500 మందితో ఖిలార్జెస్ట్ బేర్‌ఫుట్ వాక్‌ఖిఅనే కార్యక్రమం నిర్వహించి గిన్నిస్ రికార్డు సృష్టించింది. దేశంలోనే గిన్నిస్ పుస్తకంలో స్థానం పొందిన తొలి విశ్వవిద్యాలయంగా పాలమూరు విశ్వవిద్యాలయం రికార్డు సృష్టించింది.

**స్నాతకోత్సవాలు ఇలా..**

మొదటి స్నాతకోత్సవంలో 7636 డిగ్రీలు ప్రదానం చేయగా, రెండో స్నాతకోత్సవంలో 14,765, 2022నవంబరు22న జరిగిన మూడో స్నాతకోత్సవంలో 33,577 డిగ్రీలు, 71బంగారు పతకాలు ప్రదానం చేశారు. నేడు జరుగనున్న నాలుగో స్నాతకోత్సవం విశ్వవిద్యాలయం అభివృద్ధిలో మరో మైలురాయిగా నిలువనున్నది.ఈ ఏడాది 12పీహెచ్‌డీలు, 83బంగారు పతకాలు, 2809 పీజీ, 8291 ప్రొఫెషనల్ కోర్సులు, 18666 యూజీ డిగ్రీలు ప్రదానం చేయనున్నారు.

**40వేల పట్టభద్రులు..**

మహబూబ్‌నగర్ జిల్లాలోని పాలమూరు విశ్వవిద్యాలయం అనేక విశేష విజయాలను సాధించి, తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్యా విస్తరణలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని, న్యాక్ ద్వారా గుర్తింపు పొంది రాష్ట్రంలో ఏకైక యూనివర్సిటీ అని పీయూ విశిష్టతను సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. హైదరాబాద్ లోని శిల్పారామంలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. పాలమూరు విశ్వవిద్యాలయం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్‌ను ముఖ్యమంత్రి వీక్షించారు.విశ్వవిద్యాలయం పరిధిలో అంతర్జాతీయ ప్రమాణాల సింథటిక్ అథ్లెటిక్‌ట్రాక్, వన్యప్రాణులు,అరుదైన పక్షులు, జంతువులు, జీవవైవిధ్య రక్షణకు ప్రత్యేక బయోడై వర్సిటీ జోన్‌ను ఏర్పాటు చేసింది.అదేవిధంగా హెర్బల్ గార్డెన్, సువాసన మొక్కల తోటలు కూడా ఆకర్షణగా నిలుస్తున్నాయ న్నారు. సామాజిక బాధ్యత, మహిళా సాధికారత, పచ్చదనం రక్షణ వంటి రంగాల్లో విశేషంగా కృషి చేస్తూ,గ్రీన్ ఛాంపియన్ అవార్డు" ను అందుకుంది. క్రీడా రంగంలో విద్యార్థులు రాణిస్తూ, జి. మహేశ్వరి అఖిల భారత ఇంటర్ యూనివర్శిటీ అథ్లెటిక్ పోటీల్లో విజేతగా నిలిచింది.ఈ విశ్వవిద్యాలయం నుండి ఇప్పటి వరకు 40,000 కంటే ఎక్కువ మంది విద్యార్థులు పట్టభద్రులుగా అవతరించారు. ఫార్మసీ, ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ కోర్సుల్లో 100 ప్లేస్‌మెంట్లు,అలాగే ..కొత్తగా స్థాపించిన ఇంజినీరింగ్ కళాశాలలో 100 అడ్మిషన్లు సాధించబడటం విశేషం. అదనంగా రూ.15 కోట్ల విలువైన పరిశోధనా ప్రాజెక్టులు జరుగుతున్నాయి.సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదానం, ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తూ, 2500 మందికి పైగా లబ్ధిదారులకు మేలు చేసింది. గిన్నీస్ వరల్డ్ రికార్డులో కూడా పాలమూరు విశ్వవిద్యాలయం స్థానం సంపాదించడం మరో గర్వకారణమని పేర్కొన్నారు.

**నిధులు కేటాయింపు ఇలా..**

కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు యూనివర్సిటీ అభివృద్ధికి తమ వంతుగా నిధులు అందిస్తున్నాయి. గతంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో నిధులు సుమారుగా సగం శాతం అధికంగా వచ్చాయని చెప్పవచ్చు. 2008 నుంచి ఇప్పటివరకు సుమారు రూ.165కోట్ల నిధులు మంజూరు చేశాయి. ఈ ఒక్క ఏడాది రూ.45కోట్లు కేటాయించడం విశేషం. కేంద్రం రూ.155కోట్లు పీఎం ఉషా ,రూసా ద్వారా నిధులు మంజూరు చేసింది.

# విధి నిర్వహణలో నిబద్ధతతో మెలగాలి

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ◆ విద్యా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, హాజరైన విద్యాధికారులు

**వనపర్తి, అక్టోబరు 15 ప్రభాతవార్త:** విద్యాశాఖ అధికారులు విధి నిర్వహణలో నిబద్ధతతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని లేదంటే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓలు, క్లస్టర్ హెడ్మాస్టర్ల పాఠశాలల సందర్శన నివేదికను కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ నెలలో ఇప్పటివరకు ఒక్క పాఠశాల కూడా సందర్శించని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు విధి నిర్వహణలో నిబద్ధతతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని లేదంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సమాజంలో విద్యార్థులను ఉన్నత శిఖరాలను చేర్చి మంచి సమాజాన్ని నిర్మించడంలో ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారులు కీలక పాత్ర అని బాధ్యతాయుతంగా విధి నిర్వహణలో పాల్గొనాలని ఆదేశించారు. ఎంఈఓ లు, క్లస్టర్ హెడ్మాస్టర్లు తప్పనిసరిగా రోజుకు రెండు లేదా మూడు పాఠశాలలను విధిగా సందర్శించి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సందర్శించిన పాఠశాలల్లో ఎఫ్ ఎల్ఎన్ అటెండెన్స్, అపార్ ఐడి జనరేషన్ పై దృష్టి సాధించి మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఈ సంవత్సరం పదో తరగతి బోర్డు ఫలితాల్లో విద్యార్థులు 100 ఉత్తీర్ణత సాధించాలని, ఒక్కరు కూడా ఫెయిల్ అవ్వడానికి ఆస్కారం ఉండొద్దని ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, ఎంఈఓ లు, క్లస్టర్ హెడ్మాస్టర్లు, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

## సీఎంఆర్ సమర్పించిన వారికి ధాన్యం కేటాయింపు : కలెక్టర్

**వనపర్తి, అక్టోబరు 15 ప్రభాతవార్త:** గత ఖరీఫ్ సీజన్ లో వరి ధాన్యం పొందిన వారిలో వంద శాతం సీఎంఆర్ సమర్పించిన వారికేఖరీఫ్ 2025,26 సీజన్‌ధాన్యం కేటాయించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని ఎన్ఐసీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యనాయక్‌తో కలిసి రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఖరీఫ్ 202425 సీజన్ లో వరి ధాన్యం పొందిన వారిలో వంద శాతం సీఎంఆర్ సమర్పించిన వారికే ఖరీఫ్ 2025,26 సీజన్ ధాన్యం కేటాయించడంజరుగుతుందని స్పష్టం చేశారు. నవంబర్ 12వ తేదీలోపు పెండింగ్ సీఎంఆర్ పూర్తి చేసి కొత్త ధాన్యం పొందడానికి సహకరించాలని సూచించారు. సీఎంఆర్ పూర్తి చేసి బ్యాంకు గ్యారంటీలు కూడావేగంగా సమర్పించాలని సూచించారు. ఈ ప్రక్రియ సజావుగా సాగితేనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కేటాయించడానికి అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. లేదంటే ఎట్టి పరిస్థితిలో ధాన్యం కేటాయించడం జరగదు అని తెలిపారు. సమావేశంలో పౌర సరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, డిఎం జగన్, రైస్ మిల్లర్లు, పాల్గొన్నారు.

## సరిహద్దులో ఎలాంటి అక్రమ రవాణాకు అవకాశం ఉండకూడదు

### జిల్లా ఎస్పీ టి శ్రీనివాసరావు



పోలీస్ సిబ్బంది యూనిఫామ్స్ పరిశీలిస్తున్న ఎస్పీ

**అయిజ అక్టోబర్15,ప్రభాతవార్త:** మండల పరిధిలోని సరిహద్దులలో ఎలాంటి అక్రమ రవాణాకు అవకాశం ఉండకూడదని జిల్లా ఎస్పీ టీ శ్రీనివాసరావు పేర్కొన్నారు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ను ఇన్స్పెక్షన్ చేశారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూఫిర్యాదుదారుల నుండి వచ్చే పాజిటివ్ స్పందనే పోలీస్ పని తీరుకు నిదర్శనంగా నిలుస్తుందని ఆ దిశగా పోలీస్ అధికారులు, సిబ్బంది మరింత బాధ్యతతో విధులు నిర్వహించాలనిఎస్పీ అధికారులకు, సిబ్బందికి సూచించారు. అలాగే రిసెప్షన్ సిబ్బంది స్టేషన్కు వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్లైన్లో నమోదు చేయాలని ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని సూచించారు పోగొట్టుకున్న 10 సెల్ ఫోన్లు జిల్లా ఎస్పీ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు అనంతరం పట్టణంలో ఏర్పాటు చేసిన 15 సి.సి. కెమెరాలను ప్రారంభించారు. అనంతరం వార్షిక తనిఖీలలో భాగంగా సిబ్బంది యూనిఫామ్ టర్న్ ఔట్, స్టేషన్ రికార్డ్స్, పరిసరాలను తనిఖీ చేశారు అంతకుముందు పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం స్టేషన్ పరిసరాల శుభ్రత, సిబ్బంది బ్యారక్స్, స్టేషన్ రికార్డుల మెంటేనేన్స్ ను పరిశీలించారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేస్తూ.. కిట్ ఆర్టికల్స్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్వాధీనం చేసుకున్న కేసులో ఉన్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డు లను తనఖీ చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును చేయాలని, ఆస్థి సంబంధిత నేరాలకు సంబంధించి, అధిక నేరాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్ లు గా గుర్తించి, పగలు, రాత్రి బీట్ డ్యూటీల ద్వారా నిఘా కట్టుదిట్టం చేయాలని సూచించారు. కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు పోలీస్ స్టేషన్ గా ఉన్నందున ఎలాంటి ఇల్లీగల్ రవాణా జరుగకుండా చెక్ పోస్ట్ ల దగ్గర పటిష్ట నిఘా ఉండాలని ఎస్పై శ్రీనివాస్ కు సూచించారు. గ్రామాలలో తిరుగుతూ ప్రజలతో మమేకం అవ్వాలని, తద్వారా గ్రామాలలో ఎలాంటి సమాచారం కావాల్లన్న ముందస్తుగా తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. గ్రామాలలో అనుమానిత వ్యక్తులను పాపిలోన్ డివైస్ ను వినియోగించి, వేలిముద్రాలను చెక్ చేస్తూ..పాత నేరస్తులను గుర్తించాలని అన్నారు. నేరాల అదుపులో,జరిగిన నేరాలను ఛేదించడంలో ఉపయోగపడే సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ.. ప్రజలే స్వచ్ఛందంగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. స్టేషన్ రికార్డులైన పార్ట్ 1 5 పెండింగ్ లేకుండాచూడాలని, సిబ్బందికి వర్టికల్ వారీగా విధులను కేటాయించాలని ఎస్.హెచ్.ఓ కు సూచించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణకు, సైబర్ నేరాల నివారణకు వివిధ స్కూల్స్ కళాశాలలు,పని ప్రదేశాలలో కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు ఈ తనిఖీలలో ఎస్పీ వెంబడి అదనపు. ఎస్పీ కె శంకర్, డి.ఎస్పీ మొగిలయ్య, శాంతినగర్ సీఐ టాటా బాబు, ఎస్పై శ్రీనివాసులు, తరుణ్ కుమార్ రెడ్డి ఉన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని చెక్ చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశాలిస్తున్న కలెక్టర్

## మధ్యాహ్న భోజనమెలా ఉంది?

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధ్యాయులు ప్రతిరోజు మధ్యాహ్న భోజనం చెక్ చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కలెక్టర్ పాఠశాల ఆవరణను పరిశీలించారు.స్కూల్ ఆవరణను శుభ్రంగా ఉంచాలని సూచించారు. పాఠశాల ఆవరణలో ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్కూల్‌కాంపెక్స్ హెచ్ఎం అనందమ్మ,రేవతి ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

(మొదటి పేజీ తరువాయి)

పట్టణ మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు:** రేవల్లి మండలం వద్దేగేరికి చెందిన 15 మంది బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం గ్రామ నాయకులు వద్దే శేఖర్, బాల్‌రెడ్డి మండల అధ్యక్షుడు పర్వతాలు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి వనపర్తి పట్టణంలోని తిరుమల హిల్స్‌లో గల తన నివాసం వద్ద కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా బిఆర్ఎస్ పాలనలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని నేడు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమపథకాలను స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మంచితనాన్ని చూసి ఆకర్షితులమైన తాము కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు.కార్యక్రమంలో గోపాల్‌పేట ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ సత్యశీలారెడ్డి, సురేష్ గౌడ్, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చట్టసభల్లో బీసీలకు మొండి చేయి

(మొదటి పేజీ తరువాయి)

హరిశంకర్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జానయ్య యాదవ్, సూర్యారావు, బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ సాగర్, బెక్కం జనార్ధన్, సారంగిలక్ష్మీకాంత్, బుగ్గన్న, కోరమోని వెంకటయ్య, శ్రీనివాస్ ,విశ్రాంత డిఇఓవిజయ్ కుమార్,విశ్రాంత అటవీధికారి వెంకటయ్య, న్యాయవాది నిర్మల, కార్మిక, కర్షక, వివిధ కుల సంఘాల నాయకులు విద్యార్థి,యువజన సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఉపాధ్యాయులు నేర్చుకున్న ప్రతి విషయాన్ని విద్యార్థులకు బోధించాలి

**దామరగిద్ద, అక్టోబరు 15 ప్రభాతవార్త :** ఏ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్ మూడు రోజుల శిక్షణ కార్యక్రమం పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామరగిద్ద ముగింపు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి కోర్సు డైరెక్టర్ జిహెచ్ఎం సురేష్ మాట్లాడుతూ నూతనంగా ఆరో తరగతి నుండి తొమ్మిదవ తరగతి విద్యార్థులకు ఏ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్ ప్రవేశపెట్టడం జరిగిందని ఈ శిక్షణలో ఉపాధ్యాయులు కోడింగ్ డాటా సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజైన్ థింకింగ్ డిజిటల్ సిటిజెన్షిప్ అనే అంశాలపై శిక్షణ ఉంటుందని ఇక్కడ నేర్చినటు వంటి అంశాలను విద్యార్థులకు బోధించినచో విద్యార్థులకు ఉపయోగపడుతుందనిశిక్షణలో దామరగిద్ద, నారాయణపేట్, ధన్వాడ, మరికల్,నాలుగు మండలాల నుండి 45 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇక్కడ నేర్చినటువంటి మూడు రోజులశిక్షణ కార్యక్రమంలోఅంశాలను పాఠశాలల్లో బోధించాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి హెచ్ భాను ప్రకాష్, సివి రామన్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు బీజీ కనకప్ప, రాములు,రిసోర్స్ పర్సన్ అమృత్, తిప్పన, నయుం,చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## పెళ్లిచేసుకుంటానని.. యువతిని మోసం చేసిన యువకుడు

### తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు

**రాజాపూర్, అక్టోబరు 15 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలకేంద్రానికి చెందిన దాసరిగల్ల శివ అనే యువకుడు రాజాపూర్ గ్రామానికి చెందిన ఓ16 సంవత్సరాల యువతిని పెళ్లి చేసుకుంటాననిమాయా మాటలు చెప్పి మోసం చేసిన విషయమై బాధితురాలు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజాపూర్ ఎస్ఐ శివానంద్ గౌడ్ తెలిపారు.పెళ్లి పేరుతో యువతులను మోసం చేస్తే, శరీరకంగా అనుభవించిన అనంతరం తమకేమీ తెలియదన్నట్లుగా ప్రవర్తిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ పేర్కొన్నారు. పెళ్లి పేరుతో యువతిని మోసం చేసిన దాసరిగల్ల శివను బుధవారం అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరిపర్చిన్నట్లు ఎస్ఐ శివానంద్ గౌడ్ పేర్కొన్నారు.

## నేడు ఎమ్మెల్యే రాక

**దేవరకద్ర,అక్టోబరు15 ప్రభాతవార్త:** దేవరకద్ర మండల కేంద్రం లోనీ శ్రీనివాస గార్డెన్స్‌లో ఉదయం 10 గం.లకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, జిల్లా అబ్జర్వర్లు కర్ణాటక రాష్ట్రానికి చెందిన నారాయణస్వామి, మెట్టు సాయికుమార్ విచ్చేయుచున్నారని కౌకుంట్ల మండలం అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి అన్నారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ సేవాదళ్, యూత్ కాంగ్రెస్ ఎన్ఎస్ యుఐ, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి కోరారు.

## జిల్లా ఎస్పీని సన్మానించిన టియుడబ్ల్యూజె 143 సభ్యులు

**నారాయణపేట టౌన్, అక్టోబరు15 ప్రభాతవార్త:** ఇటీవల నారాయణపేట జిల్లాకు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డా. వినీత్‌ను టియుడబ్ల్యూజే 143 యూనియన్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి పూలమొక్కను అందజేశారు. టియుడబ్ల్యూజే 143 జిల్లా అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, ఎలక్ట్రానిక్ మీడియా టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు విష్ణు వర్ధన్ రెడ్డి, యూనియన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

## ఎఫ్‌పీవో క్షేత్ర సందర్శనకు వనపర్తి రైతులు

**భూత్పూర్, అక్టోబరు15,ప్రభాతవార్త:** ఎన్‌సీడీసీ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీ ద్వారా వనపర్తి నుండి జిల్లా కోపరేటివ్ అధికారి పరిమళా దేవి జాయింట్ రిజిస్ట్రార్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా నుంచి ఉత్పత్తిదారుల సంఘాల డైరెక్టర్లు, డైరెక్టర్లు సభ్యులు సీఈవోలు అకౌంటెంట్లు క్షేత్రస్థాయి సందర్శనకు షేర్పల్లిలోని భూత్పూర్ ఫ్రెండ్ రైతు ఉత్పత్తిదారుల సంఘంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలనువీక్షించుట కోసం వ్యవసాయ మెలుకువలు తెలుసుకోవడానికి గ్రామానికి 45మంది రైతులు వచ్చారు. కార్యక్రమంలో ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన కే వీరస్వామి సంఘంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాసెసింగ్ యూనిట్ గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో రైతు సంఘం యొక్క బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ బత్తుల మల్లేష్ యాదవ్,మొల్గర వెంకటయ్య, రచమోని రామకృష్ణ, మందడి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బిగ్రప్రతినిధి నాగరాజు,రైతులు బి శ్రీనివాసులు, బి గోవర్ధన్, బి నర్సింహులు, ఏ శంకరయ్య ఉన్నారు.